RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 20 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | శుక్రవారం| ఏప్రిల్ | 24 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00

## కాళేశ్వరం జడ్జిమెంట్‌పై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై గతంలో వెలువడిన తీర్పులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, న్యాయపరమైన అంశాలను అత్యున్నత న్యాయస్థానంలో బలంగా వినిపించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసు వ్యవహారంలో ఇటీవలే హైకోర్టు ఊహించని తీర్పునిచ్చింది. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు హైకోర్టులో భారీ ఊరట లభించిన విషయం తెలిసిందే. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కేసీఆర్ పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు తేల్చింది.



### ఇరాన్‌తో చర్చల కోసం నాపై

## ఎలాంటి ఒత్తిడి లేదు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్‌తో చర్చలు పునఃప్రారంభించడానికి తనపై ఎలాంటి ఒత్తిడి లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, కాల్పుల విరమణ పొడిగింపు స్వల్పకాలమే అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. ఈ సంఘర్షణను తాను త్వరగా ముగించాలనుకుంటున్నట్లు ప్రజలు భావిస్తున్నారని, కానీ అలాంటిదేమీ లేదని స్పష్టంచేశారు. ప్రస్తుతానికి తమ ఆలోచన అంతా అమెరికా ప్రజల కోసం ఒక మంచి ఒప్పందం కుదుర్చుకోవడం పైనేఉందని అన్నారు. శాంతి ప్రతిపాదనను సమర్పించడానికి ఇరాన్‌కు ఎలాంటి గడువును విధించలేదని అన్నారు. కాల్పుల విరమణ కొనసాగుతుండగా హార్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. బుధవారం ఇరాన్ పలు నౌకలపై కాల్పులు జరిపి,కొన్నింటిని స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ అంశంపై కూడా ట్రంప్ స్పందించారు. ఇరాన్ స్వాధీనం చేసుకున్న నౌకలు తమవి కావని తెలిపారు.



### కార్మికులు తొందరపాటు నిర్ణయాలు

## తీసుకోవద్దు

**ఆర్టీసీ సమ్మెపై కేబినేట్ భేటీలో ప్రస్తావన**
**నేడు చర్చలు జరపాలని డిప్యూటి సిఎంకు ఆదేశం**
**అనాలోచిత చర్యలకు పాల్పడవద్దని శ్రీధర్ బాబు వినతి**

హైదరాబాద్, ఏప్రిల్23 :ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన కేబినెట్ భేటీలో మాట్లాడారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తాము చిత్తశుద్ధితో ఉన్నామని.. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. శుక్రవారం కార్మిక సంఘాలతో చర్చించాలని మంత్రులకు సీఎంసూచించారు. ఈక్రమంలోడిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు.. కార్మిక సంఘాలతో సమావేశం కానున్నారు. నర్సంపేటలోఓడ్రైవర్ ఆత్మహత్యాయత్నానికిఒడిగట్టిన ఘటన నేపథ్యం లో సిఎం ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇదిలావుంటే ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించి..సమ్మె విరమించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.



### ఓటు వేయడం బాధ్యతగా

## గుర్తించండి

### తమిళనాడు, బెంగాల్ ఓటర్లకు మోడీ పిలుపు

న్యూఢిల్లీ, ఏప్రిల్23 : తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ సందర్భంగా.. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ దృష్ట్యా, ఓటర్లు ఉత్సాహంగా తరలిరావాలని ఆయన కోరారు. ఓటు వేయడాన్ని కేవలం ఒక బాధ్యతగా మాత్రమే కాకుండా, దేశం పట్ల ఒక పవిత్ర కర్తవ్యంగా భావించాలని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, కాబట్టి ఏ ఒక్కరూ ఓటింగ్‌కు దూరం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మోదీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మొదటిసారి ఓటు వేస్తున్న యువత నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.



## ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్

### ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

గజ్వెల్,ఏప్రిల్23 : సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ – సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస్'...ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్/ ఎక్విప్‌మెంట్(వోఎఫ్ సీఈ), ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ(ఐఈటీ), టెక్నాలజీ / డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో బేకర్ హ్యూస్.... ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ విభాగానికి అవసరమైన హై ప్రెసిషన్ ఉత్పత్తులు తయారవుతాయి. కొత్తగా 230 హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కి ఉపాధి లభిస్తుంది. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' మరింత విశ్వవ్యాప్తం అవుతుంది.



### ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు..

## ప్రమాదం

### 11 మంది దుర్మరణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లాలోల ఘోర రోడ్డు ప్రమా దం చోటు చేసుకుంది. ఈ విషాదకర సంఘటన బుధవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో జరిగింది. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయా రు. వివరా ల్లోకి వెళ్తే..కంకర లోడుతో వెళ్తున్న ఓ ట్రక్కు అదుపు తప్పి ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు బొలేరో వాహనాన్ని ఢీ కొనడంతో బొలేరో వాహనంలో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు అలుము కోవడంతో 11మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుందని మీర్జాపూర్ ఎస్పీ అపర్ణా రజత్ కౌశిక్ తెలిపారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోం దన్నారు. ప్రమాదానికి దారితీసిన సంఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



### రాజకీయ విరామం తీసుకోవాల్సిన

## సమయం వచ్చింది

### మల్లికార్జున ఖర్గేపై రామచందర్ రావు సెటైర్లు

హైదరాబాద్,: ఎన్నికల వేళరాజకీయ విమర్శలు తారస్థాయికి చేరుకున్నాయి. ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో, కేంద్ర ఎన్నికలసంఘం ఆయనకు నోటీసులుజారీ చేసింది. ఈ పరిణామంపై తెలంగాణ బీజేపీ నేత రాంచందర్ రావు తీవ్రంగా స్పందించారు. ఖర్గేగా తన సొంత నిర్ణయాలతో కాకుండా, పూర్తిగా రాహుల్ గాంధీ కనుసన్నల్లోనే నడుస్తున్నారని ఆయన ఆరోపించారు. వయసు రీత్యా ఆయన రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకోవడం ఉత్తమమని, ఆయన చేసే ప్రతి తప్పుడు ప్రకటనకు రాహుల్ గాంధీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజలే రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.



### రెండోరోజూ కొనసాగిన

## ఆర్టీసీ సమ్మె

**ఎక్కడిక్కడే నిలిచిపోయిన బస్సులు**
**బలవంతంగా నడిపేందుకు యత్నాలు**
**పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 23 : ఆర్టీసీ సమ్మెలో భాగంగా రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని.. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదని.. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని ఆనాడు కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారిందని తెలిపారు. ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని చెప్పుకొచ్చారు. రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు వెనకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారని.. అసలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తీరిస్తే సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని.. ప్రభుత్వం మెడలు వంచి హామీలను సాధిద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారని.. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా అని నిలదీశారు. 'మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది' అంటూ ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశం అయిన వెంటనే ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. తూతూ మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు.



### తెలంగాణ సాధనలో

## ఆర్టీసీ కార్మికులే కీలకం

**అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి వారికుంది**
**రాణీగంజ్ డిపోముందు సంఘీభావం పలికిన తలసాని**

## నర్సంపేట ఆర్టీసీ డిపో వద్ద ఉద్రిక్తత

### డ్రైవర్ ఆత్మహత్యాయత్నం!



నర్సంపేట : వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో వద్ద గురువారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన నిరసన ప్రదర్శన ఒక్కసారిగా హింసాత్మకంగా మారింది. అధికారుల మొండి వైఖరిని నిరసిస్తూ ఒక డ్రైవర్ అందరూ చూస్తుండగానే ఒంటికి నిప్పంటించుకోవడం కలకలం రేపింది. గురువారం తమ డిమాండ్ల సాధన కోసం నర్సంపేట డిపో కార్మికులు సమ్మె చేపట్టారు.

ఇందులో భాగంగా గురువారం డిపో గేటు ముందు భారీ ధర్నా చేపట్టారు. నిరసన హోరెత్తుతున్న సమయంలో, తీవ్ర మనస్తాపానికి గురైన ఒక డ్రైవర్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. క్షణాల్లో మంటలు చెలరేగడంతో తోటి కార్మికులు హతాశులయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను ఆర్పివేసి, బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ఆగ్రహించిన కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి నిరసనకారులను నిలువరిస్తున్నారు.

# సంపాదకీయం

## బయో ఫ్యూయెల్‌కు ప్రోత్సాహం నిల్..

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్ధాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహొలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ిీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/ బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం: పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడా నికి, అవి అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది.

# అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది. భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఫిబ్రవరి 3 తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది దేశంలో సరఫరా లోటుకు కారణంగా మారవచ్చు. చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు అని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటి. అమెరికాతో డీల్ కోసం భారత్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది. ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది. అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు. ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.

భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు.

# ఉన్నత విద్యారంగం చుట్టూ ఊహాలోక విహారం

"ఉన్నత విద్యారంగం ఎలా వుంది? ఏ వైపు పయనిస్తోంది?" అనేదాన్ని బట్టి "మన సమాజం ఎలా వుంది? అది ఏ వైపు నడుస్తోంది?" అని మనం సులభంగా అంచనా వెయ్యొచ్చు. కాకుంటే కొంచెం ఓపికతో, వాస్తవిక దృష్టితో మనం చూడగలగాలి. శాస్త్ర సాంకేతిక రంగం ప్రపంచాన్ని శాసిస్తున్న యుగంలో ఉన్నత విద్య ఏ దేశాన్నయినా ఆ పోటీలో దీటుగా ఎంత నిలబడగలిగేలా చెయ్యగలదో మాత్రమే గాదు, ఒకానొక చారిత్రక సంధ్యలో సమాజపు ఆలోచనలు, విలువలు, తాత్విక ధోరణులు ఎలా వున్నాయో కూడా ఒక రకంగా నిర్ణయిస్తుంది, ప్రతిబింబిస్తుంది. అంతే కాదు, లోతుగా ఉన్నత విద్యారంగాన్ని విశ్లేషించడం ద్వారా సామాజిక ధోరణుల పట్ల సమస్యల పట్ల మన ఆలోచనల్ని మనం పదును పెట్టుకోగలం, సరి చేసుకోగలం కూడా. మరి ప్రస్తుత ఉన్నత విద్యారంగపు ధోరణులు ఏమిటి? దాని పయనం ఎటువైపు?: ఈ మధ్యనే "అఖిల భారత ఉన్నత విద్యా సర్వే-2025 (ఎ.ఐ.ఎస్.హెచ్.ఇ) గణాంకాలు కొన్ని బయటకొచ్చాయి. వీటి ప్రకారం 2022-23 లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 60.9 శాతం. జనరల్ విద్యార్థుల కంటే వీరు 95 లక్షలు ఎక్కువ. ఏదో వానకాలపు డిగ్రీ చదువుల్లోనే కాదు అత్యున్నత, ఆధునిక కోర్సులన్నిటిలోనూ వెనకబడిన వర్గాల పిల్లలు బాగా పెరిగారు. వైద్య విద్యలో వీరు47.7 శాతం వుంటే, పీజీ వైద్య విద్యలో 40 శాతం వున్నారు. ఎంటెక్‌లోఅయితే 63 శాతం ఈ వర్గపు పిల్లలే. ఇంకా విశేషమేమంటే బాలుర కన్నా బాలికలుఎక్కువ మంది ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇదే వరవడి కొనసాగితే 2027-28 నాటికి వెనకబడిన వర్గాల పిల్లలు మూడింట రెండు వంతులవుతారు. ఏ విధంగా చూసినా ఇది అద్భుతమైన విషయం అనిపిస్తుంది. ఒకరకంగా చరిత్ర తిరగబడ్డదన్పిస్తుంది కూడా. ఇప్పటిదాకా ఎవరు పల్లకీలు మోశారో, ఎవరు కులవృత్తులకు అతుక్కు పొయ్యారో వారు బంధనాలు తెంచుకోవడమిది. సమాజపు అట్టడుగు పొర వేగంగా ఊర్ధ్వచలనానికి సమాయత్తం కావడమిది. మన సమాజపు రూపురేఖలే మారిపోతున్నాయనడానికి కూడా ఇదో సాక్ష్యం. బహుశా మరో 10-15 ఏళ్లలో 'వెనకబడిన వర్గాలు' అన్న పదబంధమే అర్థం లేనిది అవుతుందన్న ఆశనిది రేకెత్తిస్తుంది. తరతరాల లింగవివక్షకు ఇంత తొందరగా ముగింపు లభించిందా అని కూడా ఆశ్చర్యమేస్తుంది. ఈ రిపోర్టు వ్యాఖ్యానం సైతం మనల్ని ఊహాలోక విహారం చేయిస్తుంది! దీనికి తగ్గట్టు అగ్ర వర్ణాల విద్యార్థుల నమోదు శాతమే కాదు, ఆశ్చర్యకరంగా సంఖ్య కూడా పడిపోతోంది. ప్రస్తుతం వీరి నమోదు 39 శాతం మాత్రమే. గత దశాబ్దంలో వీరి సంఖ్య 11 లక్షలు పడిపోయింది. ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే వీరు 7.12 లక్షల నుంచి 6.20 లక్షలకు తగ్గిపొయ్యారు. తమిళనాడులోనూ, కేరళలోనూ ఇదే స్థితి. ఇలా ఎందుకు జరుగుతోందో మరింత లోతుల్లోకి వెళ్ళి చూడాల్సి వుంది. పై వర్గాల జనాభా వేగంగా తగ్గిపోవడాన్నిది సూచిస్తోందని కొందరు దీనిపై వ్యాఖ్యానిస్తుండగా ; విదేశాలకు వెళుతున్న వారిలో ఎక్కువ మంది ఈ వర్గాల వారనీ, వారు ఎ.ఐ.ఎస్.హెచ్.ఇ గణాంకాల్లోకి ఎక్కడం లేదనీ మరికొందరు విశ్లేషిస్తున్నారు.

కానీ ఓపిగ్గా తరచి చూస్తే మరో కోణం ఆవిష్కృతం అవుతుంది. వాస్తవానికి మన దేశంలో ఉన్నత విద్యలోకి వెళుతున్న వారే 2022 నాటికి 28.4 శాతం. ఇది ఏడాదికి 0.67 శాతం మాత్రమే పెరుగుతోంది. మరి ఉన్నత విద్యకు దూరంగా ఉన్న 71.6 శాతం విద్యార్థులెవరు? ఖచ్చితంగా వెనుకబడిన వర్గాల వారే. అంటే కళాశాలలో నమోదైన వారిలో వెనుకబడిన వర్గాల వారు పెరిగినంత మాత్రాన మనం ఆశావహ స్థితిలోకి వెళ్ళలేము. సమాజంలో ఏదో పెద్ద సంచలనం జరిగిపోతోందని మురిసిపోలేము. అలాగే కళాశాలల్లో వున్న 60.9 శాతం బలహీన వర్గాల వారెవరు? దీని ఆరా తీస్తే ఈ వర్గాల్లోనూ కింది పొరల్లోని పెద్ద వర్గం పైచదువులకు దూరంగానే వున్నట్టు అర్థమవుతుంది.

ఎందుకంటే రోహిణి కమిషన్ ప్రకారం 37 శాతం వెనకబడ్డ వర్గాల కులాల వారికి ఉద్యోగాల్లో ఏ ప్రాతినిధ్యం లేదు. వారికి రిజర్వేషన్ల వల్ల దక్కింది సున్నా. అంతే కాకుండా 994 కులాలకు 2.68 శాతం ఉద్యోగావకాశాలు మాత్రమే దక్కాయి. ఇదే లెక్క ఉన్నత విద్యారంగ ప్రవేశాలకూ వర్తిస్తుంది. అంటే బలహీన వర్గాల్లో ఒక పెద్ద వర్గం పైచదువులకు దూరంగానే వుందన్న మాట. ఇప్పుడు మనం మాట్లాడుకోవాల్సింది వీరి గురించి. మన పథకాలు, ప్రోత్సాహాలు అందాల్సింది వీరికి. సామాజికాభివృద్ధి అంటే వీరి అభివృద్ధి. మన ఆలోచనల్లో దీనికి తగ్గ మార్పు రావలసి వుంది. అలాగే మన విద్యారంగం కూడా వర్గాలకతీతంగా ఏమీ లేదు. అదీ అత్యున్నత, ఉన్నత, మధ్య, పేద వర్గాల వారీగా విడిపోయింది.

అశోక విశ్వవిద్యా లయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒకే వర్గాల పిల్లలేమీ చేరడం లేదు. మనం గాట్ ఒప్పందంపై సంతకం పెట్టాక జ్ఞానం సరుకుగా మారి, దానికి తగ్గట్టు విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయి. ఒక వైపు చూస్తే మన పిల్లలు 13.8 లక్షల మంది విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్నారు. ఒక్కొక్కరు 30 లక్షల రుణాలు తీసుకొని మరీ విదేశాలకు వెళుతున్నారు. ఇంకోవైపు ఓపెన్ విశ్వవిద్యాలయాలు, ఆన్‌లైన్ కోర్సులు, ఒకేషనల్ కోర్సులు, తూతూ సర్టిఫికెట్ల కళాశాలలు వున్నాయి. మన ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న వారంతా గీత గీసినట్టు పేద విద్యార్థులే. ఈ విభజనను పట్టించుకోకుండా కేవలం సంఖ్యలతో, శాతాలతో సంతృప్తి పడలేము.

# పిపిపి విధానంలో కుంకుమసాగు

విశాఖపట్టణం,: పిపిపి మోడల్ కింద లంబసింగిలో పెద్ద ఎత్తున కుంకుమ పువ్వును పండించడానికి కంపెనీలకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పనితీరును సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక గిరిజన వర్గాల భాగస్వామ్యంతో కుంకుమ పువ్వు సాగుకు పిలుపునిచ్చారు. "స్థానిక గిరిజన వర్గాల భాగస్వామ్యంతో పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) మోడల్ కింద లంబసింగిలో పెద్ద ఎత్తున కుంకుమ సాగును చేపట్టడానికి సిద్ధంగా ఉన్న కంపెనీలకు అనుమతి ఉంటుంది" అని చంద్రబాబు ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా కశ్మీర్‌గా పిలుచుకునే లంబసింగి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి మండలంలోని ఒక చిన్న గ్రామం. లంబసింగి ఇప్పటికే కాఫీ, మిరియాలు మరియు స్ట్రాబెర్రీ పంటలను పండిస్తోంది. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సాగును అభివృద్ధి చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలతో పాటు అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దక్షిణాది రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, ఎగుమతుల్లో లోపం ఉందని ముఖ్యమంత్రి గమనించారు. దానిపై ప్రధానంగా దృష్టి పెట్టి ఎగుమతులను పెంచాలని అధికారులకు సూచించారు. ఆక్వాకల్చర్ గురించి ఆలోచిస్తూ, ఆక్వాకల్చర్ కార్యకలాపాల నమోదు తప్పనిసరి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద సహజ వ్యవసాయ కేంద్రంగా మార్చడానికి చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. త్వరలోనే మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులతో సమావేశం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్ నిర్మించడానికి కూడా చంద్రబాబు ఓకే చెప్పారు. డిజి రైతుబజార్ యాప్, వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు ఏపీ ఏఐఎంఎస్ యాప్, కిసాన్ డ్రోన్ యాప్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. రాష్ట్రాన్ని ప్రకృతి వ్యవసాయ



క్షేత్రంగా మార్చే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు సీఎం చంద్రబాబు. ఇప్పుడు 18 లక్షల మందికిపైగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారని దాన్ని నాలుగేళ్లలో 50 లక్షలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రకృతి ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రెస్‌బిలిటీ సౌకర్యాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్‌తో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు చంద్రబాబు. ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి వాటిని రాష్ట్రంలోనూ వినియోగించుకోవాలన్నారు. యూఎస్, ఈయూతో ట్రేడ్ ఒప్పందం వేళ రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు మరింత అవకాశం కలిగిందని అధికారులు వివరించగా, అయితే నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సీఎం అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి కేంద్ర పాలసీలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని చెప్పారు.

# పేదవాడి మెతుకు కార్డుపై అధికారుల నిర్లక్ష్యం..?

ఇటిక్యాల: కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వందలాదిమంది నిరుపేదల ఆశలు అడియాశలవుతున్నాయి. గత పది ఏళ్ల తరబడి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు దేవుడు కరుణించిన కానీ అధికారులు కనికరించరన్న అపవాదిని రెవెన్యూ అధికారులు మూటగట్టుకుంటున్నారు. రేషన్ కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు నెలలు తరబడి రేషన్ కార్డుల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి కార్యాలయాల్లో ఫైళ్లు కదలాలంటే ‹చేతులు తడవాల్సిందే‹ అన్న విమర్శలు కార్యాలయ వెలుపల్లో వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరు దారుణంగా ఉంది. అర్హులైన నిరుపేదలు మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా, అవి నేటికీ ఎమ్మార్వో లాగిన్‌లలోనే మూలుగుతున్నాయి. విచారణ పేరుతో కాలయాపన చేయడం, సాంకేతిక కారణాలు చెప్పి దరఖాస్తులను తిరస్కరించడం అధికారులకు పరిపాటిగా మారింది. జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎమ్మార్వో కార్యాలయంలో సిబ్బంది అవినీతి అవతారమెత్తిన ‹అప్రూవల్‹ కొందరు అధికారులు, సిబ్బంది పేదవాడి ఆకలిని పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. అర్హత ఉన్నా సరే, రేషన్ కార్డు ఆమోదం పొందాలంటే మధ్యవర్తుల ద్వారా వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ః డబ్బులు ఇస్తేనే పని జరుగుతుందని లేదంటే ఫైల్ పెండింగ్‌లో ఉంటుందనే ధోరణి ఎమ్మార్వో ఆఫీసుల్లో బహిరంగ రహస్యంగా మారింది. లంచం ఇచ్చుకోలేని నిరుపేదలు ప్రభుత్వ పథకాలకు దూరమై తీవ్రంగా నష్టపోతున్నారు. కార్యాలయానికి వెళ్లిన ప్రజలకు అధికారులు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు.

సర్వర్ డౌన్ అని ఒకరు, పై అధికారులు ఇంకా ఆదేశాలు ఇవ్వలేదని ఒకరు తమ దగ్గర ఏమి పెండింగ్ లేదు అంతా జిల్లా స్థాయిలోనే ఉందని మరొకరు సాకులు చెబుతూ తమ బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాల గురించి మాట్లాడటం తప్ప, క్షేత్రస్థాయిలో ఒక నిరుపేదకు రేషన్ కార్డు ఎందుకు అందడం లేదన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డు కేవలం బియ్యం కోసమే కాదు,

అది ఒక నిరుపేద కుటుంబానికి ఆరోగ్య శ్రీ , ఇతర ప్రభుత్వ పథకాలకు ప్రధాన ఆధారం. కార్డు మంజూరులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరుతాయని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

# పార్టీ నిర్మాణంపై ఫోకస్..!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత పాలనలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నంలో పడ్డారు. పార్టీ నిర్మాణం పై ఆయన ఫోకస్ పెట్టినట్లు పార్టీలో ప్రచారం జరుగుతుంది. గత ఎన్నికలలో ఓటమి పాలయి పదకొండు సీట్లకు పరిమితమయిన నాటి నుంచి జగన్ నోట కార్యకర్తల మాట పదే పదే వినిపిస్తుంది. ఒకరకంగా జగన్‌కు జ్ఞానోదయం అయింది. నియోజకవర్గాల వారీగా నేతలు అనుసరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్న జగన్ త్వరలోనే నియోజకవర్గానికి కార్యకర్తలతో కమిటీలు వేయాలని నిర్ణయించారని తెలిసింది. కార్యకర్తలకు ఇక ఐడి కార్డు, ఇన్స్యూరెన్స్ కల్పించనున్నారు. కార్యకర్తల్లో ఉన్న నిరాశను పారదోలాలంటే కార్యకర్తలను దగ్గరకు తీసుకునే ప్రయత్నాన్ని మొదలు పెట్టారన్నారు. వైఎస్ జగన్ ఎప్పుడూ తన బొమ్మతోనే గెలవాలని భావిస్తుంటారు. తన వల్లనే అధికారంలోకి రావాలని కోరుకుంటారు. 2019 ఎన్నికలలో పాదయాత్రతో అది జరిగినా, 2024 ఎన్నికల్లోనూ అదే మైండ్ సెట్ తో వెళ్లడంతో దారుణ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజు కూడా కార్యకర్తల సమాశాలను జరిపింది లేదు. ప్లీనరీ ఏదో ఒకసారి తప్పించి అసలు నిర్వహించలేదు. క్యాడర్ తో కలవడం, వారితో కలసి భోం చేయడం వంటి పనులకు దూరంగా ఉన్నారు. టీడీపీ మహానాడు నిర్వహించేది కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికే. జెండా పట్టుకునే వారికి కనీసం ఏడాదికి ఒకసారి అయినా పలకరించాలన్న ధ్యాసను జగన్ మర్చిపోవడం వల్లనే మొన్నటి ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడే వారు లేకపోయారుఇక అధికారంలో ఉన్న ఐదేళ్లు పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఓటమి తర్వాత గ్రౌండ్ లెవెల్ లో పరిస్థితి అర్థమయింది. నేతలు బయటకు రావడం లేదు. ధైర్యంగా వచ్చే కార్యకర్తలు సయితం నిర్లక్ష్యానికి గురి కావడంతో దూరంగా ఉన్నారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకున్న జగన్ ఇక కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు.

# మాటల్లేవా..?



గుంటూరు, : తెలుగు సినిమా ఇండస్ట్రీలో పవన్ కళ్యాణ్ కి చాలా మంచి క్రేజ్ అయితే ఉంది. ఆయన నుంచి వచ్చిన ప్రతి సినిమాలో ఏదో ఒక వైవిధ్యమైతే ఉంటుంది. ప్రతి ప్రేక్షకుడిని థియేటర్ కి రప్పించడం ఆయన కీలకపాత్ర వహిస్తూ ఉంటాడు?అలాంటి పవన్ కళ్యాణ్ నుంచి వచ్చే ప్రతి సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుంది. తన అభిమానులు సైతం అతని సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. గత సంవత్సరం ఓజీ సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించిన ఆయన ఈ సంవత్సరం 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు? ఈ సినిమా ఎలా ఉ ఒడబోతుంది అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ అటు పాలిటిక్స్ లో బిజీగా ఉంటూనే సినిమాలను చేస్తూనే తన అభిమానుల ను అలరించే ప్రయత్నం చేస్తున్నాడు?ఇక ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది నటులతో మాట్లాడటం లేదనే వార్తలు వైరలవుతున్నాయి. బేసిగ్గా పవన్ కళ్యాణ్ ఎవరితో గొడవ పెట్టుకోడు. ప్రొఫెషన్ పరంగా మాత్రం ఆయన ఎవరి పని వాళ్ళు చేసుకుంటే బాగుంటుందనే ఆలోచనలో ఉంటాడు.ఇలాంటి నటుడు తన క్లోజ్ ఫ్రెండ్ అయిన అలీ వైసీపీ పార్టీలోకి వెళ్లి పవన్ కళ్యాణ్ దూషిస్తూ కొన్ని మాటలు మాట్లాడడంతో ప్రస్తుతం ఇప్పటికీ అతనితో పవన్ కళ్యాణ్ మాట్లాడడం లేదట. ఒకవేళ అలీ కనక పవన్ కళ్యాణ్ తోనే ఉండుంటే ఇప్పుడు అలీ చాలా మంచి పొజిషన్లో ఉండేవాడు. పాలిటిక్స్ లో కూడా తను రాణించే అవకాశమైతే ఉండేది.కానీ అలా కాకుండా వైసీపీ పార్టీ లోకి వెళ్లి తప్పు పని చేశారని చాలామంది అతన్ని విమర్శిస్తున్నారు. ఇక ఏది ఏమైనా కూడా పవన్ కళ్యాణ్ కి అత్యంత ఆత్మీయుడైన అలీ వేరే పార్టీలో చేరడాన్ని పవన్ కళ్యాణ్ జీర్ణించుకోలేకపోయాడు. అందుకే ప్రస్తుతం పవన్ కళ్యాణ్ అలీతో మాట్లాడడం లేదనే వార్తలు కూడా వస్తున్నాయి?

# ఇరకాటంలో ఐరోపా..!



ప్రపంచ పరిణామాలు సామాన్యుల ఊహకు అందకుండా మారుతున్నాయి. అనేక దేశాలు, దేశాధినేతల బండారాలు బయటపెడు తున్నాయి. ఏ రెండు పలనూ సంతుష్టీకరించాలంటే జరిగేది కాదు. వెనెజులామన మిత్రదేశమే, చౌకగా చమురు తెచ్చుకున్నాం, డోనాల్డ్ ట్రంప్ బెదిరించగానే మానేశాం, ఆ దేశాధ్యక్షుడు మదురో, సతీమ ణి కిడ్నాప్ తప్పని చెప్పలేకపోయాం. ఇరాన్ కూడా మనకు మిత్రదేశ మే. అమెరికా బెదిరించగానే అక్కడి నుంచీ కొనుగోలు నిలిపివేశాం. ఆదేశం మీద దాడులు చేస్తాం, పాలకులను మా ర్చివేస్తామని అమెరికా బెదిరిస్తుంటే తగదని అనలేకపోయాం. ఇరాన్‌లో చిక్కుకు న్నవారిని సురక్షితంగా రమ్మని సుభాషితం మాత్రమే చెప్పాం తప్ప రష్యాఉక్రెయిన్ యుద్ధ సమయంలో మా దిరిగా విమానాలు పంపి మన దేశీయులను వెనక్కి తీసుకురాలేదు.కొన్ని సమయాల్లో కొంద రు ఎలా ప్రవర్తిస్తారో గుర్తు చేసేందుకే ఇవి. ఈ సందర్భంగా అ మెరికా బెదిరింపులపై ఐరోపా స్పందన గురించి విశ్లేషించుకుం దాం. ప్రస్తుతం ఐరోపా ఇరకాటంలో పడింది. మదురో కిడ్నాప్, వెనెజులా చమురు సంపదలన్నింటినీ స్వంతం చేసుకుంటామన్నపు డు దానికి పట్టలేదు. ఇప్పుడు డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామనగానే ఐరోపా సమాఖ్యకు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. 'ఆర్కిటిక్ ప్రాంతానికి బాసట' పేరుతో పరిమిత విన్యాసాలు జరిపేందుకు గ్రీన్‌లాండ్‌కు మద్దతుగా పన్నెండు దేశాలు మిలిటరీని పంపేందుకు నిర్ణయించాయి. కొన్ని దేశాల నుంచి చేరుకున్నారు కూడా. దీంతో ఆగ్రహించిన ట్రంప్ ధిక్కారమును సైతునా అంటూ ఐరోపా దేశాల వస్తువుల మీద ఫిబ్రవరి ఒకటి నుంచి అదనపు సుంకాలు విధిస్తానని ప్రకటించాడు. అయితే దీనికి ప్రతిగా తాము కూడా అమెరికా వస్తువులపై 108 బిలియన్ డాలర్ల మేర ప్రతి సుంకాలు విధించేందుకు ఆలోచిస్తున్నట్లు ఐరోపా సమా ఖ్య ప్రకటించింది. గ్రీన్‌లాండ్ మా ఒక్కరి భద్రత కోసమే కాదు, ఐరోపా రక్షణకూ అవసరమే అని, తాము స్వాధీనం చేసుకోకపోతే రష్యా,చైనా ఆక్రమిస్తే మీకు అంగీకారమేనా అంటూ ట్రంప్ యం త్రాంగం ఎదురుదాడికి దిగింది. గత ఎనిమిది దశాబ్దాలుగా ఐరోపా రక్షణ బాధ్యత పేరుతో నాటో ఖర్చులో అధిక భాగం అమెరికా భరించింది. ఆ మేరకు పొదుపు మొత్తాలను పారిశ్రామిక, వాణిజ్య, సేవారంగాలకు మళ్లించిన ఐరోపా అనేక విధాలుగా రెండు ప్రప ంచ యుద్ధ నష్టాల నుంచి కోలుకున్నది. ఐరోపా నుంచి అమెరికా దిగుమతులు ఎక్కువగా చేసుకుంటున్నది. 2015 19తో పోలిస్తే 2020 24 నాటికి అమెరికా నుంచి ఐరోపా దేశాలు దిగుమతి చేసుకున్న ఆయుధాలు 28 నుంచి 52శాతానికి పెరిగాయి. అందువలన మాతో తెగేదాకా లాగితే ఆయుధ దిగుమతులు తగ్గిస్తామని ఐరోపా సంకేతాలు పంపుతున్నది. అంతే కాదు చైనాతో లావాదే వీలు పెంచుకోవాల్సి వస్తుందని కూడా చెబుతున్నది. అందుకే దాగుడుమూతలాడుతున్నాయి. చైనా ప్రమాదాన్ని చూపి భారత్‌ను తన బుట్టలో వేసుకోనేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా, అదే ఎత్తుగడతో రష్యాను చూపి ఐరోపాను తన అదుపులో ఉంచుకోవా లని చూస్తున్నది. అందుకే అప్పుడప్పుడు మిత్రవైరుధ్యాలు తలెత్తి నప్పటికీ వాటిని శత్రువుల స్థాయికి తీసుకువెళ్లకుండా రాజీపడు తున్నాయి. ఇది ఎల్లకాలమూ సాధ్యమౌతుందా?

బలహీనమైన అంశాల పట్ల కఠినంగా, బలమైన వాటి పట్ల జా గ్రత్తగా వ్యవహరిస్తున్నది ఐరోపా. దాన్లో భాగమే అమెరికా వస్తు వులపై పన్ను వేస్తామని హెచ్చరించటంగా చెప్పవచ్చు. అట్లాంటిక్ దేశాల మధ్య ఇదొక తీవ్రమైన సంక్షోభానికి గుర్తు అని తాజా పరిణామాల గురించి ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యానించింది. అంత తేలికగా అమెరికా వత్తిడికి ఐరోపా లొంగే అవకాశాలు లేవనికొందరు చెబుతున్నారు. ట్రంప్‌ను సంతుష్టీకరించేందుకు ఇప్పటి వరకు ఐరోపా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనట్లుగా చెబు తున్నారు. గ్రీన్‌లాండ్ కావాల్సిందేనని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ మరోసారి చెప్పాడు. ఆ ప్రాంతం అమెరి కాలో అంతర్భాగం గాకపోతే రక్షణ అసాధ్యమన్నాడు. తమ చర్య అందరికీ మంచిదని, యూరోపియన్స్ దీన్ని అర్థం చేసుకుంటారని భావిస్తున్నా అని మాత్రమే బెసెంట్ చెప్పాడు. ట్రంప్ ఈ విషయంలో వెనక్కు తగ్గకపోతే అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందానికి ఐరోపా పార్లమెంటు ఆమోద ముద్రవేసే అవకాశం లేదని వార్తలు వచ్చాయి. ఒకవైపు అమెరికాను అడ్డుకోవాలంటున్న ఐరోపా దేశాల మధ్య పూర్తి ఏకాభిప్రాయం లేదు. గ్రీన్‌లాండ్ ప్రాంతంలో మిలిటరీ విన్యాసాలకు దూరంగా ఉండాలని జర్మనీ నిర్ణయించింది. జర్మనీ మిలిటరీ బృందం రెండోరోజే వెనక్కి వెళ్లింది. ఈ విన్యాసంలో పాల్గొన్న దేశాల మీద ప్రత్యేకించి పన్నులు విధించాలని ట్రంప్ నిర్ణయించినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి అన్నమాట ప్రకారం పన్నులు వేస్తారా లేక బేరసారాల కోసం వాయిదా వేస్తారా అన్నదిచూడాల్సి ఉంది. ఐరోపా ప్రతిపన్ను హెచ్చరిక కూడా ఎత్తుగడలో భాగమే అంటున్నారు. అమెరికాతో తెగతెంపులు చేసుకుంటే ఎనిమిది దశాబ్దాలుగా అనుసరించిన విధానాలన్నింటినీ మార్చుకోవాల్సి ఉ ంటుంది. అదిఒక్క గ్రీన్‌లాండ్‌తోనే సమసిపోదు. మొత్తం నాటో కూటమి ఉనికి ప్రశ్నార్థకం అవుతుంది. ప్రపంచ బలాబలాల్లో వచ్చే మార్పులు తమకు లాభదాయకమా లేక అమెరికాతో ఉంటేనే మంచిదా అన్న మధింపు జరిగిన తరువాత నిర్ణయాత్మక పరిణామాలు జరుగుతా యి తప్ప ఇప్పటికిప్పుడు జరిగే అవకాశాలు పరిమితం. అసలు గ్రీన్‌లాండ్‌తో నిమిత్తం లేకుండానే ఎప్పటి నుంచో ఐరోపా మీద వత్తిడి తెచ్చేందుకు అమెరికా ఒక వ్యూహం అనుసరిస్తున్నదని చెబుతున్నారు.

# నీలి విప్లవాన్ని నీరుగారుస్తున్న సర్కార్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు అరవై ఏండ్లపాటు తెలంగాణ మత్స్యరంగం పూర్తిగా నిర్లక్ష్యానికి, అణచివేతకు, విస్మరణకు గురైంది. ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో దాదాపు పదేండ్లలో గుణాత్మక అభివృద్ధి నమూనాగా రూపొందింది. ఇప్పుడు ఆ నమూనాలను సమూలంగా ధ్వంసం చేసేందుకు కాంగ్రెస్ పాలకులు పూనుకున్నట్టు కనిపిస్తున్నది. ఇందుకుపలు నిదర్శనాలు ఉన్నాయి. రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం, స్వావలంబ న కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన చేపపిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని నీరుగార్చడం, మత్స్యసహకార సంఘాలను నిర్వీర్యం చేయడం, మత్స్యకారుల ఉపాధి కల్పనలో జీవనాడిగా నిలిచిన నీటివనరులను విధ్వంసం చేయడం లాంటి మూడు పద్ధతులను ఈ ప్రభుత్వం అమలు పరుస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రప్రభుత్వమే సహకార వ్యవస్థను అడ్డుపెట్టుకుని, మత్స్యశాఖను వాడుకుంటూ ముప్పేట దాడికి పాల్పడుతున్నది. ఫలితంగా రాష్ట్రంలోని 50 లక్షలకుపైగా మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోనే వినూత్నమైన పద్ధతిలో మత్స్యకారులకు చేపపిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని అమలు చేసింది. 2016లో ప్రారంభిం చిన ఈ పథకంతో ఎనిమిది పర్యాయాలు లబ్ధి చేకూర్చింది. ఇందుకు రూ.560 కోట్లు ఖర్చుచేసింది. మత్స్య సహకార సంఘాల బలోపేతం కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా సుమారు రూ.1000 కోట్ల భారీ రుణసదుపాయంతో సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని అమలు పరిచింది. ఈ రెండు కార్యక్రమాల ఫలితంగా మత్స్యకారుల జీవితాల్లో నూతనోత్సాహం కనిపించింది. మత్స్యసహకార సంఘాల్లో సభ్యత్వానికి ఆసక్తి, పోటీ పెరిగాయి. సంఘాల్లో సభ్యులుగా చేరడాన్ని గుర్తింపు, గౌరవంగా భావించే పరిస్థితులు నెలకొన్నాయి. సమగ్ర విధానాలతో చేపల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల నమోదయ్యింది. మత్స్యకారుల తలసరి ఆదాయం పెరిగింది. తెలంగాణలో నీలివిప్ల వం కనిపించింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేండ్లుగా మత్స్యరంగంలో, మత్స్యకారుల జీవన స్థితిగతుల్లో తిరోగమన పరిస్థితులు ఎదురవుతున్నాయి. నీలి విప్లవం నీరుగారిపో తున్నది. చేపపిల్లల పంపిణీ పథకం అమల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. రెండేండ్లలో పథకం కనీసం 50శాతం కూడా అమలు జరగలేదు. చేపపిల్లలు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలోనూ ప్రభుత్వం మొండివైఖరిని అవలంబిస్తున్నది. కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించగా, బిల్లుల చెల్లింపు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది.

అయినప్పటికీ ప్రభుత్వం కాంట్రాక్టర్లను సతాయిస్తూనే ఉన్నది. బిల్లులను పూర్తిగా చెల్లించలేదు. ఈ తాత్సారంపై కూడా కాంట్రాక్టర్లు మరోసారి హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. బిల్లుల చెల్లింపు వ్యవహారాలు కోర్టుధిక్కరణ కేసులను నమోదుచేసే స్థాయికి వెళ్లాయి. అయినా ఈ ప్రభుత్వంలో, మత్స్యశాఖలో చలనం లేదు. కొత్తగా మత్స్యశాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ పథకాన్ని పకడ్బం దీగా, పారదర్శకంగా అమలు చేస్తున్నదని, రూ.122 కోట్లు కేటాయిం చినట్టు గొప్పలు చెప్పారు. కానీ మంత్రి ప్రకటించిన లెక్కల్లో సగం కూడా వాస్తవంలో పంపిణీ జరగకపోవడం, నిధులు ఖర్చు పెట్టకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి, మత్స్యశాఖమంత్రి పనితీరుకు అద్దం పడుతున్నది. ఇక ప్రత్యేక పథకం అమలు పరచాలనే ఆలోచన, ప్రయత్నం ప్రభుత్వం వద్ద లేవు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఫిషరీస్ కార్పొరేషన్ అంశం ఉద్దేశపూర్వకంగానే అటకెక్కించారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి మత్స్యశాఖమంత్రిగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించడంలేదు. మొత్తంగా గడిచిన రెండేండ్ల కాంగ్రెస్ పాలనాకాలంలో మత్స్యకారుల్లో తీవ్రమైన నిరాశ, నిస్పృహ నెలకొన్నాయి. కానీ మత్స్యశాఖ అధికారులు మాత్రం తెలంగాణలో చేపల ఉత్పత్తి ఏటా పెరుగుతున్నదని, చేపల ఆహార వినియోగంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతున్నదని, రాష్ట్రంలోని ప్రజలకు చేపలు విస్తారంగా అందుబాటులో ఉంటున్నాయని 'స్టీరియోఫోనిక్' నివేదికలు తయారుచేసి, స్వీయ కితాబులు ఇచ్చుకుంటున్నారు. సహకార వ్యవస్థకు సంబంధించిన స్ఫూర్తిని సమూలంగా సంహరించడ మే తెలంగాణలో నేటి పాలకులు తమ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మత్స్య సహకార సంఘాల ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. పేద మత్స్యకారుల సాధికారత కోసం ఏర్పడిన ఈ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నది. ముఖ్యంగా తెలంగాణ సహకార సంఘాల చట్టం-1964లోని సెక్షన్ 32 (7)(ఏ) (1)ను అడ్డం పెట్టుకొని, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను అడ్డుకుంటూ, పాలకపెద్దలు తన సొంత పార్టీ క్యాడర్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌ల రూపంలో సంఘాలపై రుద్దుతున్నది. సాధారణంగా ఏదైనా సహకార సంఘం పదవీ కాలం ముగిసినప్పుడు, అనివార్య కారణాల వల్ల ఎన్నికలు జరగకపోతే, తాత్కాలికంగా ఆ సంఘం కార్యకలాపాల ను పర్యవేక్షించడా నికి అధికారులను లేదా ఒక కమిటీని నియమిం చేందుకు ఈ సెక్షన్ అవకాశం కల్పిస్తుంది. అయితే, ఇది కేవలం తాత్కాలిక ఏర్పాటు మాత్రమే.

## మదురో కిడ్నాప్ తర్వాత!

ఒక సర్వ సత్తాక దేశం మీద దాడి చేసి ఆ దేశపు అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలనూ కాలరాసిన ట్రంప్ తాను వెనిజులాలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడానని చెప్పుకుం టున్నాడు ! మదురో ఒక మాదకద్రవ్య ముఠాకు నాయకుడిగా ఉన్నట్టు, ఆ ముఠాను అరికట్టకపోతే అమెరికా భద్రతకే ముప్పు వాటిల్ల నున్నట్టు ప్రచారం చేస్తున్నాడు. కానీ వాస్తవానికి ప్రపంచంలో జరుగుతు న్న కొకైన్ వ్యాపారంలో ఉన్న అంతర్జాతీయ ముఠా నెట్‌వర్క్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నది మెక్సికో, కొలంబియా, హొండురాస్, అర్జెంటినా, ఈక్వెడార్ వంటి దేశాల్లోనుండి పని చేస్తున్న మితవాద శక్తులు. ఈ శక్తులకు అమెరికా అండదండలు పుష్కలంగా లభిస్తున్నాయి. అందులో వెనిజులా దేశంలోని డ్రగ్ మాఫియా వాటా నామమాత్రమే. ఐనా, తక్కిన దేశాలను వదిలిపెట్టి వెనిజులా మీదనే పడ్డాడు ట్రంప్.

ఈ దాడికి ప్రధాన కారణం వెనిజులాలో ఉన్న చమురు నిల్వల మీద పెత్తనాన్ని పొందాలని అమెరికా భావించడమే. వెనిజులాతో ప్రారంభించి మొత్తం లాటిన్ అమెరికా దేశాలన్నింటిపైనా తన పెత్తనాన్ని చెలాయించాలని అమెరికా భావిస్తోంది. 1817–1825 మధ్య అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించిన జేమ్స్ మన్రో ఆ కాలంలో ఒక సిద్ధాంతాన్ని ప్రకటించాడు. దానినే మన్రో సిద్ధాంతం అని పిలుస్తారు. దాని ప్రకారం తన దేశ భద్రత, రక్షణ అవసరాల కోసం ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా సైనిక చర్యలతో సహా ఎటువంటి చర్యలకైనా పూనుకునే హక్కు అమెరికాకు ఉంది. చాలా దుర్మార్గమైన ఈ సిద్ధాంతానికి తర్వాత కాలం చెల్లింది. కాని ట్రంప్ శతాబ్దాలక్రితమే తిరస్కరించబడిన ఆ సిద్ధాంతాన్ని మళ్లీ ముందుకు తెచ్చాడు. ఇప్పుడు మన్రో సిద్ధాంతం కాస్తా 'డాన్రో' సిద్ధాంతంగా పేరు మార్చుకుంది. (ట్రంప్ పేరులోని మొదటి భాగం డొనాల్డ్‌లోని డాన్ ను, మన్రో పేరులోని ఒక భాగాన్ని కలిపి డాన్రో చేశారు)

అమెరికాకనుకూలంగా తొత్తు మాదిరిగా వ్యవహరించే ప్రభుత్వాన్ని తొలగించి ఆ స్థానంలో చావెజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వెనిజులాలోని చమురు కంపెనీలను జాతీయం చేశాడు. వాటి ద్వారా లభించే ఆదాయాన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేయసాగాడు. దానికి ప్రతీకారంగా అమెరికా వెనిజులా మీద ఆంక్షలు ప్రకటించింది. విదేశాల్లో ఉన్న వెనిజులా పెట్టుబడులను స్తంభింపజేసింది. దాంతో వెనిజులా తీవ్ర ఆర్థిక వత్తిడికి లోనైంది. ఆ పరిస్థితుల్లో వెనిజులా చైనా, రష్యా, ఇరాన్ దేశాలతో ఆర్థిక, సైనిక సంబంధాలను బలపరుచుకుంది. తక్కిన లాటిన్ అమెరికా దేశాలకు దగ్గరైంది. ఐనప్పటికీ అమెరికా ఆంక్షలు వెనిజులాను కుంగదీశాయి. గతంలో రోజుకు 3.5 లక్షల బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేసిన పరిస్థితి నుండి ఆంక్షల తర్వాత అందులో మూడో వంతు కూడా ఉత్పత్తి చేయలేని స్థితి వచ్చింది. ఇదే అదనుగా భావించిన ట్రంప్ మదురో దంపతుల కిడ్నాప్‌కూ పూనుకున్నాడు. వారిని అడ్డం పెట్టుకుని వెనిజులాలోని చమురు కంపెనీల మీద మళ్లీ పెత్తనాన్ని పొందాలని భావిస్తున్నాడు. అందుకు వీలుగా వెనిజులాలో తన తొత్తుగా వ్యవహరించే మారియా కొరినా మచాడోను గద్దె మీద కూర్చోబెట్టదలిచాడు. కానీ వెనిజులాలోని ప్రజాభిప్రాయం అందుకు బాగా వ్యతిరేకంగా ఉంది. మదురోతోబాటు ఉపాధ్యక్షురాలిగా పని చేసిన డెల్సీ రోడ్రిగజ్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు ఇప్పుడు నిర్వహిస్తున్నారు, తామంతా మదురోతోనే ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు అమెరికా ఎలా వ్యవహరించబోతోంది అన్నది చూడాలి.

వెనిజులాలో చమురు నిల్వల మీద పట్టు ఒకవేళ అమెరికా సంపాదిం చినా, మళ్లీ అక్కడ చమురు ఉత్పత్తిని పాత స్థాయికి తీసుకురావాలంటే 18000 నుండి20000 కోట్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడులు వెంటనే అవసరం. కాని అమెరికన్ చమురు కంపెనీల మొత్తం పెట్టుబడులే 41,300 కోట్ల డాలర్లు. అదీ గాక, ఒకసారి జాతీయం అయిన చమురు కంపెనీల నుండి తాము పొందుతున్న ప్రయోజనాలను చవి చూసిన వెనిజులా ప్రజలు తమ చమురు కంపెనీలను అమెరికాకు కట్టబెట్టడానికి అంగీకరించే పరిస్థితిలో లేరు. ఇంకో పక్క చైనా కూడా వెనిజులాలో భారీగానే పెట్టుబడులు పెట్టింది. మదురోను కిడ్నాప్ చేసిన వెంటనే చైనా, రష్యా వెనిజులాకు, మదురోకు తమ మద్దత్తు ప్రకటించాయి. అందుచేత వెనిజులా విషయంలో అమెరికాదే ఇష్టారాజ్యంగా చెలామణీ అవుతుందని భావించలేం.

# ఎమ్మెల్యే ముద్దు... ఎంపీ వద్దు..!

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర పై చాలా ఆశలు పెట్టుకుంది. అందుకే ఆ పార్టీ సీనియర్లకు ఇప్పుడు పెద్దపీట వేస్తోంది. శాసనమండలిలో వైసీపీ పక్ష నేతగా బొత్స సత్యనారాయ ణకు అవకాశం ఇచ్చింది. ఇక ధర్మాన ప్రసాదరావుకు తాడేపల్లి కార్యాలయ బాధ్యతలతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే ఇదంతా ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాల్లో బలం పెంచుకోవడానికి స్పష్టమవుతోంది. ఉత్తరాంధ్రలో మొత్తం 34 అసెంబ్లీస్థానాలు ఉన్నాయి. ఐదు పార్లమె ంటు స్థానాలు కొనసాగుతున్నాయి. మొన్నటి ఎన్నికల్లో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చింది. అయితే 2029 ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని భావిస్తోంది ఆ పార్టీ. అయితే అసెంబ్లీ స్థానాలకు పర్వాలేదు కానీ.. పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసేందుకు ఆ పార్టీకిఅభ్యర్థులు దొరకడం లేదు.ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం,అరకు, అనకాపల్లి, విశాఖపట్నం పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అందులో ఒక్క అరకులోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ తనుజారాణి ఉన్నారు. మిగతా చోట్ల కూటమి ఎంపీలే కొనసాగుతున్నారు. శ్రీకాకుళం నుంచి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం నుంచి కలి శెట్టి అప్పలనా యుడు, విశాఖ నుంచి శ్రీ భరత్,అనకాపల్లి నుంచి సీఎం రమేష్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో సీఎం రమేష్ ఒక్కరే బిజెపి నుంచి ఎంపీగా ఉన్నారు. అయితే టిడిపి కూటమి నుంచి సిట్టింగ్ ఎంపీలు మరోసారి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం పోటీ చేసేందుకు నేతలు ముందుకు రావడం లేదు. దీంతో జగన్మోహన్ రెడ్డి ఆ బాధ్యతను బొత్స సత్యనారాయణకు అప్పగించినట్లు ప్రచారం నడుస్తోంది.శ్రీకాకుళం జిల్లాలో కింజరాపు రామ్మోహన్ నాయుడు వరుసగా మూడుసార్లు ఎంపీ అయ్యారు. బలమైన అభ్యర్థిగా మారారు. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయనను ఢీకొట్టడం అంటే చాలా కష్టం. 2019 ఎన్నికల్లో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానంలో మాత్రం రామ్మోహన్ నాయుడు గెలిచారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఐదు చోట్ల వైసిపి గెలిచింది. కానీ రామ్మోహన్ నాయుడు మాత్రం గెలిచారు ఎంపీగా. గడిచిన ఎన్నికల్లో ఆయనపై పోటీ చేసి ఓడిపోయారు పేరాడ తిలక్. 2019లో దువ్వాడ శ్రీనివాస్ పోటీ చేసి ఓడిపోయారు. 2014లో రెడ్డి శాంతి పోటీ చేసి అలానే ఓడిపోయారు.

అయితే ఈసారి తమ్మినేని సీతారాం పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. అయితే రామ్మోహన్ నాయుడు కు ధీటైన అభ్యర్థిని రంగంలోకి దించాలని జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేస్తున్నారు. కానీ ఎవరు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అయితే ధర్మాన ఫ్యామిలీ నుంచి ఒకరిని బరిలో దించితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.విజయనగరం ఎంపీగా ప్రస్తుతం కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ పై గెలిచారు. 2029 ఎన్నికల్లో మరోసారి బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేస్తానని చెబుతున్నారు. కానీ ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు బొత్స ఝాన్సీ లక్ష్మి ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో ఆమె ఇదే స్థానం నుంచి ఎంపీగా ఉండేవారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ నుంచి ఆమె పోటీ చేశారు. మరోవైపు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేరు కూడా వినిపిస్తోంది. అయితే ఇక్కడ బొత్స సత్యనారాయణ నిర్ణయం పనిచేయనుంది.విశాఖపట్నం నుంచి మరోసారి పోటీ చేసేందుకు మాజీ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఆసక్తి చూపిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆయన అసెంబ్లీకి పోటీ చేశారు. అయితే విశాఖ నుంచి మరోసారి బొత్స ఝాన్సీలక్ష్మి అయితే బాగుంటుందని జగన్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. మరోవైపు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పోటీ చేస్తే బాగుంటుందని వైసీపీ క్యాడర్ అంటుంది. కానీ అమర్నాథ్ మాత్రం తాను పోటీ చేయనని తేల్చి చెబుతున్నారు. తనకు విశాఖ నగరం పరిధిలో ఏదో ఒక అసెంబ్లీ స్థానం టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు.అనకాపల్లి నుంచి గత ఎన్నికల్లో పోటీ చేశారు బూడి ముత్యాల నాయుడు. మాడుగుల నియోజకవర్గం నుంచి గెలిచిన ఆయనను జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్ లోకి తీసుకున్నారు. డిప్యూటీ సీఎం పదవి కూడా ఇచ్చారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా సీఎం రమేష్ రంగంలోకి దిగారు. దీంతో జగన్మోహన్ రెడ్డి బూడి ముత్యాల నాయుడు తో పోటీ చేయించారు. కానీ ఆయనకు ఓటమి తప్పలేదు. మరోసారి ఎంపీగా పోటీ చేయాలని జగన్మోహన్ రెడ్డి సూచిస్తున్నారు. కానీ అందుకు ముత్యాల నాయుడు సుముఖంగా లేరు. తిరిగి మాడుగుల అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తానని చూస్తున్నారు.

# ఇండోర్ లో కాస్ట్లీ బిచ్చగాడు..

భోపాల్, : బిచ్చగాడు సినిమా చూశారా.. అందులో విజయ్ ఆంటోని బిచ్చం ఎత్తుకుంటూ జీవిస్తుంటాడు. అతడి దుస్థితిని చూసి చాలామంది బాధపడుతుంటారు. ఈ నేపథ్యంలోనే ఒకానొక సందర్భంలో విజయ్ ఆంటోని వెతుక్కుంటూ చాలామంది వస్తారు. అతడిని చూసి వాహనాల శ్రేణిని ఆపుతారు. ఆ తర్వాతవిజయ్ ఆంటోని ఆ కారులోకి ఎక్కుతాడు. చూసేందుకు ఆ సన్నివేశం చాలా అద్భుతంగా ఉంటుంది. ఇటువంటివి రీ లైఫ్ లో మాత్రమే సాధ్యం. రియల్ లైఫ్ లో పాసిబుల్ కావు. కానీ దీనినినిజం చేసి చూపించాడు ఈ వ్యక్తిమన దేశంలో శుభ్రమైన నగరంగా పేరుపొందిన ఇండోర్ లో ఓ వ్యక్తి యాచకుడిగా జీవిస్తున్నాడు. కాకపోతే అతడు కూటికి గతి లేని వాడు కాదు. గుడ్డకు దిక్కులేనివాడు కాదు. అతడికి ఏకంగా మూడు నివాసాలు ఉన్నాయి. అంతకుమించి అనే స్థాయిలో కార్లు ఉన్నాయి. ఇక ఆటోల గురించి చెప్పాల్సిన పనిలేదు. వడ్డీ వ్యాపారం.. భారీగా బంగారం..ఇలా చెప్పుకుం టూ పోతే అతడు అత్యంత ఖరీదైన బిచ్చగాడు. ఇటీవల మధ్యప్రదేశ్ ప్రభుత్వం బెగ్గర్ ఎరాడికేషన్ క్యాంపియన్ నిర్వహించింది.

ఇందులో అతనికి సంబంధించిన వివరాలు బయటపడ్డాయి.మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడమేనక బలమైన కారణం ఉంది. వీధుల్లో యాచక వృత్తి చేసుకుంటూ జీవించేవారికి ప్రభుత్వం తరఫున ఆర్థికంగా భరోసా కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో యాచించుకుంటూ జీవిస్తున్న మంకీలాల్ అనే వ్యక్తి పై ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. అతడికి పునరాగం కల్పించడానికి ప్రయత్నాలు చేశారు.

అయితే వారు అనుకున్నట్టుగా మంగీలాల్ కూటికి గతి లేనివాడు కాదు. అతడికి భారీగా ఆస్తులు ఉన్నాయి.అధికారుల పరిశీలనలో మంగీలాల్ ఆస్తులు కోట్లల్లో ఉన్నాయి. మంగీలాల్ వద్ద 600 స్క్వేర్ ఫీట్ సామర్థ్యంతో భగత్ సింగ్ నగర్, శివనగర్, అల్వాస్ అనే ప్రాంతాలలో మూడు నివాసాలు ఉన్నాయి.

మూడు ఆటోలు, స్విఫ్ట్ డిజైర్ కార్లు ఉన్నాయి. ఆ కారు నడపడం కోసం మంగీలాల్ ఒక డ్రైవర్ ను కూడా నియమించుకున్నాడు. తను ఈ యాచించడానికి ఎక్కడికి వెళ్లాలన్నా ఆ కారులోనే ప్రయాణ సాగిస్తు ంటాడు. ఖాళీ సమయంలో మాత్రం అద్దెకు తిప్పుతుంటాడు. మరోవైపు మంగిలాల్ కోసం మహారాష్ట్ర ప్రభుత్వం 1బిహెచ్కే ఇల్లు కేటాయించింది. అయినప్పటికీ అతడు బిచ్చం ఎత్తుకోవడాన్ని. చెక్కతో చేసిన ఒక కార్డు పట్టుకొని ఇండోర్ నగరంలో యాచిస్తున్నాడు.

# కేడర్ లో కనిపించని జోష్!

విజయవాడ, గుంటూరు, : వైసీపీ అధినేత వైఎస్ జగన్ కేవలం పరామర్శలకు మాత్రమే పరిమితమవుతున్నారు. ఇప్పటికే రెండేళ్ల కాలం పూర్తయింది. దీంతో పరామర్శలు ఆపేసి పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. వైసీపీ గత ఎన్నికల్లో కేవలం పదకొండు నియోజకవర్గాల్లోనే గెలిచింది. మిగిలిన 164 నియోజకవర్గాల్లో పార్టీ ఆశించినంత మాత్రం బాగా లేదు. అక్కడ క్యాడర్ కు, నేతలకు మధ్య గ్యాప్ పెరిగింది. రెండేళ్లవుతున్నా నేతలు కొందరు కార్యకర్తలను దగ్గరకు తీసుకోవడం లేదు. దీంతో జగన్ జిల్లాల పర్యటన చేయాలంటున్నారు. పాదయాత్ర సంగతి తర్వాత.. అది ఏడాదిన్నర తర్వాత కాని మొదలు కాదు. కానీ ఈలోపు పార్టీలోని క్యాడర్ ను, లీడర్ ను యాక్టివ్ చేయాలంటే ఖచ్చితంగా జిల్లాలకు వెళ్లి నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేయాలని నేతలు కోరుతున్నారు.ఇప్పటికీ రాయలసీమలోని ఒకటి రెండు జిల్లాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పార్టీ యాక్టివ్ గా లేదు. జగన్ బయటకు వచ్చినప్పుడు మాత్రం కార్యకర్తలు అభిమానంతో వచ్చి జగన్ కు స్వాగతం చెబుతున్నారు. జగన్ ను చూసేందుకు పోటీ పడుతున్నారు. కానీ చాలా నియోజకవర్గాల్లో పరిస్థితి మాత్రం ఇంకా మెరుగుపడలేదన్నది చాలా మంది బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ పదవులను పూర్తిగా చేపట్టలేదు. బూత్ లెవెల్ కమిటీల నియామకం చాలా చోట్ల జరగకపోవడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. పాత నేతలే తిరిగి పోటీ చేస్తారన్న భావనతో కొత్త వారు నియోజకవర్గంలో నాయకత్వ బాధ్యతలను చేపట్టేందుకు ముందుకు రావడం లేదని గట్టిగా పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.ద్వితీయ శ్రేణి నేతలు కొంత గట్టిగానే ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతలు మాత్రం అప్పుడే ఎందుకన్నట్లు కొంత ఇంకా ఆలోచనలో ఉన్నారు. జగన్ పాదయాత్ర సమయానికి బయటకు వచ్చి యాక్టివ్ అయితే బాగుంటుందని వారి వ్యాపారాలు, మిగిలిన వ్యక్తిగత వ్యవహారాల్లో మునిగిపోయారు. 175 నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల్లో గెలిచిన 151 మందిలో పది నుంచి పదిహేను మందికి మించి యాక్టివ్ గా లేరు. ఇది నిజం. పరామర్శ చేయవచ్చు. తప్పులేదు. కానీ అదే సమయంలో జగన్ జిల్లాలకు వచ్చి కార్యకర్తలతో ముఖాముఖి సమావేశాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. అప్పుడే వచ్చే ఎన్నికలకు కానీ, స్థానిక సంస్థల ఎన్నికల సమాయానికి కానీ పార్టీ పుంజుకోదని అంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పట్లో జిల్లాల పర్యటన చేసే అవకాశాలు కనిపించడం లేదు.



మరో వైపు పక్కా పథకం ప్రకారమే జోగి రమేష్ ఇంటిపై దాడి చేశారని వైఎస్ జగన్ అన్నారు. జోగి రమేష్ ఇంటి ఎదుట మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెట్రోలు బాంబులు వేసి జోగి రమేష్ ను హత్య చేయాలని పథకం పన్నారన్నారు. జోగి రమేష్ చంద్రబాబు, లోకేశ్ పై విమర్శలు చేసినంత మాత్రాన దాడులు చేస్తారా? అని జగన్ ప్రశ్నించారు. మనం నాగరిక సమాజంలో ఉన్నామా? లేక జంగిల్ రాజ్యంలో ఉన్నామా? అని నిలదీశారు. లోకేశ్ చిప్ రిపేర్ కావాలని పూజలు చేయడంలో తప్పేంటని జగన్ అన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని జగన్ హెచ్చరించారు. ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఎవరైతే అధికారులు వీరికి సహకరించారో వారందరినీ బోనులో నిలబెడతామని తెలిపారు.ప్రతి ఒక్కరూ చేసిన అన్యాయానికి శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. చిప్ సరిగ్గా ఉంటే ఎవరైనా ఇలాంటివి ఎవరైనా చేయిస్తారా? అని జగన్ ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో గొడ్డుమాంసం, జంతు కొవ్వు లేదని చెప్పినా ఇంకా రాజకీయ స్వలాభం కోసం ఆయన కూటమిలో ఉన్న పవన్ కల్యాణ్ అదే పనిగా అబద్ధాలను నిజం చేస్తున్నారని జగన్ అన్నారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని చంద్రబాబుకు ఎవరు చెప్పారని జగన్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ సిట్ దర్యాప్తు చేసిందని, అందులో కొవ్వు లేదని, తమ పార్టీకి చెందిన ఎవరి పేర్లను లేవని తెలిసినా చంద్రబాబు పదే పదే జంతువుల కొవ్వు కలిసిందంటూ అబద్ధాలు ప్రచారం చేస్తూ ఏడుకొండల వాడికి అపచారం చేస్తున్నారని జగన్ దుయ్య బట్టారు.చంద్రబాబు వేసిన వన్ మ్యాన్ కమిషన్ చేత అబద్ధాలు నిజం చేయాలని ప్రయత్నం చేస్తున్నారు తప్ప, చంద్రబాబు ఇంకా ప్రజల్లో చులకన అవుతారని అన్నారు. సీబీఐ ఇచ్చిన రిపోర్టు అనుకూలంగా రాకపోతే.. అనుకూలంగా నివేదిక కోసం కమిషన్ వేసేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అనిల్ సింఘాల్ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీటీడీ ఈవోగా ఉన్నాడని తెలిపారు. తాము ఆయనను ఈవోగా కొనసాగించామని చెప్పారు.మరి అదే అనిల్ సింఘాల్ ను ఎందుకు తొలగించారని అన్నారు. శ్యామలరావును నియమించిన చంద్రబాబు మళ్లీ ఆయనను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వంలోనే ఈ పాపం జరిగిందని, పాపం చేసిందెవరు? అని జగన్ ప్రశ్నించారు.

# కేదార్‌నాథ్, బద్రీనాథ్

## ఎంట్రీ ఫర్ హిందూస్ ఓన్లీ

న్యూఢిల్లీ, : ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ ప్రవేశాలపై కీలక ప్రకటన వెలువడింది. ఈ రెండు ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించాలని బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. మతపరమైన సంప్రదాయాలను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కమిటీ ఛైర్మన్ తెలిపారు. విశ్వాస కేంద్రాలైన ఈ ధామ్‌లలోకి తమ విశ్వాసాన్ని గౌరవించేవారినే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన త్వరలో బోర్డు ముందుంచనున్నారు. దీనికి బోర్డు ఆమోదం లభిస్తుందని భావిస్తున్నారు.దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్ , బద్రీనాథ్ ఆలయాల్లోకి ఇకపై కేవలం హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. హిందువులు కాని వారు ఈ ఆలయాల్లోకి ప్రవేశించడానికి వీలు లేకుండా నిషేధం విధించాలని.. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ బీకేటీసీ ఛైర్మన్ ధ్రువీకరించారు. హరిద్వార్‌లోని కుంభమేళా ప్రాంతంలో 105 ఘాట్‌లలో హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించాలని ప్రతిపాదన వచ్చిన కొద్ది రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలతో పాటు.. బీకేటీసీ పరిధిలోకి వచ్చే మరో 47ఆలయాల్లో కూడా హిందువులు కాని వారిని ప్రవేశించకుండా నిషేధం విధించేలా చర్యలు తీసుకో వాలని ఆలోచిస్తోంది. ఈ ప్రతిపాదనను త్వరలో బీకేటీసీ బోర్డు ముందు ఉంచే అవకాశం ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, చాలా మంది భాగస్వాములు దీనికి మద్దతు ఇస్తున్నారు. బీకేటీసీ ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, హిందువులు కానివారిని నిషేధించాలనే ప్రతిపాదన చాలా కాలం నుంచి ఉందని తెలిపారు. “దీనిని ఆదిశంకరాచార్యుల కాలం నుంచీ పాటిస్తున్నారు. మతపర మైన సంప్రదాయాలను కాపాడుకోవడంలో తప్పులేదని మేము భావిస్తున్నాము,” అన్నారు. “చారిత్రాత్మకంగా, హిందువులు కాని



వారి ప్రవేశం ఆలయాలలో నిషేధించబడింది,” అని ఆయన తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ని ఉటంకిస్తూ, మతపరమైన వర్గాలకు తమ వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు ఉందని, కాబట్టి ఈనిర్ణయం తీసుకోవడానికి కమిటీకి పూర్తి హక్కు ఉందనిఆయన స్పష్టం చేశారు. “హిందువులు కానివారు” అనే పదాన్ని తప్పుగా అర్థం చేసుకోకూడదని కూడా ఆయన స్పష్టం చేశారు. “మా విశ్వాసాన్ని గౌరవించేవారు స్వాగతించబడతారు. ఈ ధామ్‌లు పర్యాటక కేంద్రాలు కావు, అవి విశ్వాస కేంద్రాలు,” అని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం హరిద్వార్‌లోని 105 ఘాట్‌లలో హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించడం గురించి ఆలోచిస్తోంది. అలాగే, హరిద్వార్, రిషికేశ్‌లను ‘సనాతన పవిత్ర నగరం’గా ప్రకటించాలని కూడా పరిశీలిస్తోంది. హరిద్వార్ అర్ధ కుంభమేళాతో ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని, 1916లో గంగా సభ వ్యవస్థాప కుడు మదన్ మోహన్ మాలవ్యతో జరిగిన ఒప్పందంలోని నిబంధనలను కూడా దీనికి ఉపయోగించుకోవచ్చని వర్గాలు తెలిపాయి.ఈ ప్రతిపాదనలు భక్తులలో చర్చనీయాంశంగా మారాయి. ఆలయాల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఇది పర్యాటకులను, ఇతర మతాల వారిని ఎలా ప్రభావితం చేస్తుందో చూడాలి. ఈ విషయంలో భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# టూ టైర్ సిటీస్ లో రియల్

హైదరాబాద్: తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన టైర్-2 నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, తిరుపతి వంటి నగరాల్లో ఓపెన్ ప్లాట్ల వ్యాపారం గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 15 శాతంవృద్ధిని నమోదు చేసింది. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం, ఐటీ,పారిశ్రామిక రంగాలు ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తుం డటంతో పెట్టుబడిదారులు ఇప్పుడు ఈ ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు.ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల వారు భవిష్యత్తు అవసరాల కోసం ఈ నగరాల శివార్లలో ప్లాట్లు కొనడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపె ద్ద నగరంగా ఎదుగు తున్న వరంగల్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ కనిపిస్తోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ,వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ వార్తలు ఇక్కడి భూముల ధరలకు రెక్కలు తెచ్చాయి. కరీంనగర్‌లో ఐటీ టవర్లు, పర్యాటక రంగ అభివృద్ధి వల్ల పట్టణ సరిహద్దులు వేగంగా విస్తరిస్తున్నాయి. గతంలో కేవలం వ్యవసాయ భూములుగా ఉన్న ప్రాంతాలు నేడు డీటీసీపీ అనుమతి పొందిన లేఅవుట్లుగా మారుతున్నాయి. ఇక్కడ గత ఏడాదితో పోలిస్తే ప్లాట్ల అమ్మకాల్లో సుమారు 14 నుంచి 16శాతం వరకు ధరల పెరుగుదల కనిపించడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో కూడా ఇదే విధమైన ట్రెండ్ కొనసాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో పాటు, అక్కడ ఏర్పాటవుతున్న కొత్త టౌన్‌షిప్‌లు ,పారిశ్రామిక కారిడార్లు రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన కారణమయ్యాయి. తిరుపతి-మదనపల్లి , తిరుపతి-చెన్నై హైవేల వెంట వెలుస్తున్న ఓపెన్ ప్లాట్ వెంచర్లకు డిమాండ్ భారీగా పెరిగింది.ఈ నగరాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావడానికి మెరుగైన కనెక్టివిటీ ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్లు, అండర్ పాస్లు ,మెరుగైన డ్రైనేజీ వ్యవస్థలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్నిపెంచాయి. అపార్ట్‌మెంట్ల కంటే ఓపెన్ ప్లాట్లపై పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే ఎక్కువ లాభం వస్తుందని భావించడం కూడా ఈ రంగం పుంజుకోవడానికి కారణం.

# బెట్టింగ్ యాప్ లపై కొరడా..




న్యూఢిల్లీ: బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరఢా ఝుళిపించింది. ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ వల్ల యువత ఆర్థికంగా చితికిపోకుండా ఉండేందుకు కేంద్రం తాజాగా 242 చట్ట విరుద్ధమైన వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. అమల్లోకి వచ్చిన కొత్త గేమింగ్ చట్టం ప్రకారం ఇప్పటివరకు దాదాపు 8 వేల వెబ్‌సైట్లపై నిషేధం విధించింది. నగదు ప్రమేయం ఉన్న ఆన్‌లైన్ గేమ్స్‌ను నిర్వహిస్తే భారీ జరిమానాలు తప్పవని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది.ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వెబ్‌సైట్లపై కేంద్ర ప్రభుత్వం మరోసారి ఉక్కుపాదం మోపింది. ఒక్కరోజే దేశవ్యాప్తంగా 242 చట్టవిరుద్ధమైన వెబ్‌సైట్లను బ్లాక్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దేశ యువతను ఈ చెడు వ్యసనాల నుంచి కాపాడటమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా బ్లాక్ చేసిన 242 సైట్లతో కలిపి.. ఇప్పటివరకు దేశంలో మొత్తం 7,800 కంటే ఎక్కువ బెట్టింగ్, జూదపు ప్లాట్‌ఫామ్‌లను నిలిపివేశారు. గత ఏడాది తీసుకొచ్చిన కొత్త చట్టం తర్వాత ఈ చర్యలు మరింత వేగవంతం అయ్యాయి ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని క్రమబద్ధీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025 ను అమలులోకి తెచ్చింది. ఈ కొత్త చట్టం 2025 అక్టోబర్ 1వ తేదీ నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది. డబ్బుతో కూడిన అన్ని రకాల ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ సైట్లపై ఈ చట్టం పూర్తిగా నిషేధం విధిస్తుంది. ఇందులో నైపుణ్యంతో కూడిన ఆటలైనా లేదా అదృష్టంపై ఆధారపడే ఆటలైనా నగదు ప్రమేయం ఉంటే అవి చట్టవిరుద్ధ మేనని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ చట్టం ప్రకారం చట్టవిరుద్ధమైన గేమ్స్ నిర్వహించే వారికి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.1 కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.ఈ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం గేమింగ్ సేవలను అందించే సంస్థలు.. బెట్టింగ్ సైట్లను ప్రచారం చేసే ప్రకటనదారులు, ప్రమోటర్లు.. ఆ ప్లాట్‌ఫామ్‌లకు ఆర్థిక సహకారం అందించే వారిపై ప్రధానంగా చర్యలు తీసుకుంటుంది. ఈ ఆటలు ఆడే ప్లేయర్స్‌పై ప్రస్తుతానికి ఎలాంటి జరిమానాలు విధించబడవని.. కేవలం నిర్వహా కులపైనే చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఈ-స్పోర్ట్స్‌కు ప్రోత్సాహం: అన్ని ఆటలను నిషేధించడం కాకుండా.. విద్య, సా మాజిక స్ఫృహను పెంపొందించే ఈ-స్పోర్ట్స్.. ఎడ్యుకేషనల్ గేమ్స్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వీటి నియంత్రణకు ఒక ప్రత్యేక అథారిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు.

# 400 కోట్ల బ్లాక్ మనీ!



బెంగళూరు,: కర్ణాటక-గోవా సరిహద్దులోని చోర్లా ఘాట్ అడవుల్లో గతేడాది అక్టోబరులో జరిగిన ఓ చోరీ ఘటన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. గోవా నుంచి కర్ణాటక మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్న రెండు భారీ కంటైనర్లను గుర్తుతెలియని ముఠా అడ్డుకుని, అందులోని భారీ నగదును దోచుకెళ్లింది. శ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈదోపిడీ జరిగిన మూడు నెలల వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఇటీవల నాసిక్‌కు చెందిన సందీప్ పాటిల్ అనే వ్యక్తి తాను కిడ్నాప్‌కు గురయ్యానని, దోపిడీ గురించి తెలుసుకున్నందుకే తనను బంధించారని ఫిర్యాదు చేయడంతో ఈ మెగా ధూమ్ దోపిడి బయటపడింది.ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం ఎస్పీ స్థాయి అధికారినేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. తాజాగా బెల్గాం పోలీసులు కూడా ఈ విచారణలో చేరారు. మూడు రాష్ట్రాల పోలీసులు ఇప్పుడు ఆ మాయమైన కంటైనర్ల కోసం అడవులను జల్లెడ పడుతు న్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఒక హవాలా ఆపరేటర్‌తో సహా ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.ఈ దోపిడీ వెనుక కేవలం దొంగలే కాదు, కొందరు పోలీసు అధికారులు, ఒక ప్రముఖ మత గురువు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కంటైనర్లను అడ్డుకున్న ముఠాకు పోలీసులే సహకరించారని, అసలు బాధితుడు ఎవరో కూడా స్పష్టంగా తెలియకుండా జాగ్రత్త పడ్డారని తెలుస్తోంది. థానేకు చెందిన ఒక బిల్డర్‌కు చెందిన పాత నోట్లను మార్పిడి చేసే క్రమంలో ఈ దోపిడీ జరిగినట్లు సిట్ అనుమానిస్తోంది.అయితే బాధితుడు బయట కు వచ్చి ఫిర్యాదు చేయకపోవడం ఈ కేసులో అతిపెద్ద మిస్టరీగా మారింది.బెల్గాం పోలీసులు నాసిక్ వెళ్లి నిందితులను విచారించేందుకు అనుమతి కోరారు. అయితే, ఆ దోపిడీ నగదు నిజంగానే 400 కోట్లా లేక అంతకంటే ఎక్కు? అన్నది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. సంఘటనా స్థలం మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో, నిందితులు ఎక్కడ నగదును దాచారనే దానిపై క్లూస్ కోసం సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకూ బయటకు వచ్చిన సమచారం చాలా తక్కువ. ఇంకా చాలా బయటకు రావాల్సి ఉంది. గుట్టుగా ముగిసిపోతుందా.. ప్రజలకు తెలిసేలా బయటపెడతారా అన్నది మాత్రం ఇంకా ఎవరికీ తెలియదు.

# వ్యూహాత్మక మౌనమే పరిష్కారమా..?

హైదరాబాద్,: ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరగడం సహజం, ప్రజలు క్షమించడానికి సమయం పడుతుంది. తర్వాతి ఎన్నికల్లో ప్రజలే భవిష్యత్‌ను నిర్ణయిస్తారు. కానీ పదేళ్ల అధికారంతో తెలంగాణ ఛాంపియన్ లుగా ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్‌ను 2023 ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత లేదు. హామీలు అమలు చేయకపోయినా విపక్షాల నుంచి తప్ప ప్రజల నుంచి విమర్శలు రావడం లేదు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే రేవంత్ సర్కార్‌ను నిత్యం టార్గెట్ చేస్తున్నారు. దీంతో విశ్లేషకులు నేతలకు ఓపిక ఉండాలని సూచిస్తున్నారుకేటీఆర్ ప్రతీ మాట సామాన్యుడి మనసులో కౌంటర్‌గా మారుతోంది. ఇదితన మాటల విలువను తగ్గిస్తూ, పార్టీకి నష్టం కలిగిస్తోంది. రేవంత్‌పై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ కేటీఆర్ స్వయం పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నారు. గత అధికార కాలంలోని తప్పులు గుర్తుంచుకోకుండా విమర్శిస్తుండడంతో ప్రజలు పెద్దగా కనెక్ట్ కావడం లేదు.తాజా పార్టీ మార్పులపై కేటీఆర్ వ్యాఖ్యలు గతాన్ని గుర్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉంటూ ప్రతిపక్షాలను అణచివేసి, తెలంగాణ పోరాటకారులను దూరం చేసి, కొత్తలకు పదవులు పంచారు. ఇప్పుడు కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తున్నారు. స్పీకర్ ఆధారాలు లేవని ప్రకటించినా, కేటీఆర్ సోషల్ మీడియాలో రాజ్యాంగ విలువలను ప్రశ్నిస్తున్నారు. అప్పటి ఫిరాయింపులు ‘బంగారు తెలం గాణ‘ పేరుతో జరిగాయని ప్రజలు మరువలేదు కేటీఆర్.ప్రస్తుత పరిణామాల్లో మౌనం చాలా మంచిది. ప్రజలకు ఆలోచనకు సమయం ఇవ్వాలి. గత తప్పులకు పశ్చాత్తాపం చెంది, భవిష్యత్తులో అవి జరగకుండా హామీ ఇవ్వాలి. పడిగట్టు మాటలు, నాన్ స్టాప్ విమర్శలు ప్రజల మద్దతు ఆకర్షించవు. కేటీఆర్ దీన్ని గుర్తించి వ్యూహం మార్చితే పార్టీకి లాభం.అధికారంలో ఉంటూ అందరినీ ‘గులాబీకారు‘లో ఎక్కించిన గతం ప్రజల మనసుల్లో ఉంది. ఇప్పుడు విమర్శలు చేసినా, స్వీయ పరిశీలన లేకపోవడం వల్ల ప్రజలు దూరమవుతున్నారు.


## కలిపి తీసుకుంటే కష్టమే!



మాంసాహారం, పాలు ఒకేసారి తీసుకోవద్దని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం మాంసాహారం-పాలను 'విరుద్ధ ఆహారం'గా పిలుస్తారట. అందుకే, ఈ రెండిటినీ కలిపి తీసుకుంటే లేనిపోని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తు న్నారు. ఇందుకు కారణాలు చెబుతూ.. మాంసం వేడిచేసే గుణాన్ని కలిగి ఉంటుంది. పాలు చలువ చేస్తాయి. కాబట్టి, ఈ రెండూ కలిపి తీసుకున్నప్పుడు జీర్ణ ప్రక్రియలో అసమతుల్యత ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా.. పాలు, మాంసంలో ప్రొటీన్స్, పోషకాలు రెండూ అధిక మొత్తంలో ఉంటాయి. కాబట్టి, ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం వల్ల.. జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. కడుపు ఉబ్బరం, అజీర్ణం, కడుపు నొప్పి, వికారం లాంటి సమస్యలు ఎదురవుతాయని అంటున్నారు. కొందరిలో గుండెల్లో మంట కూడా వస్తుందట. కాబట్టి, మాంసాహారం తిన్న తర్వాత కనీసం 2నుంచి 3 గంటల విరామం ఇచ్చిన తర్వాతే పాలు తాగడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక చేపలు తిన్న తర్వాత పాలుతాగితే.. తీవ్రమైన అలర్జీలు వచ్చేఅవకాశంఉందని అంటున్నారు.


# నెలల శిశువుకు కడుపునొప్పి వస్తుందా?

మా పాపకు రెండున్నర నెలలు. చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఐదున్నర కిలోల బరువు ఉంది. తల్లి పాలే పడుతున్నాం. పాప మల విసర్జన సరిగా లేదు. పోయిన వారంలో నాలుగు రోజుల తర్వాత విరేచనం అయింది. అయిదు రోజులు గడిచినా ఈ వారంలో ఇంకా విరేచనం కాలేదు. పిల్లల డాక్టర్‌కి చూపిస్తే.. కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. రెండు రకాల ఓరల్ డ్రాప్స్ (చుక్కల మందు) ఇచ్చారు. పాలు ఎక్కువగా తాగకుండా చూసుకోమని సలహా ఇచ్చారు. ఆ మందులు వాడిన మరుసటి రోజు కూడా మోషన్ కాలేదు. అప్పుడప్పుడూ ఏడుస్తున్నది. కడుపు నొప్పితో ఏడుస్తుందేమోనని అనుకుంటున్నాం. అడపాదడపా పాలు తాగిన తర్వాత వాంతి చేసుకుంటున్నది. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? బరువు చక్కగానే ఉంది. తల్లిపాలు మాత్రమే తాగే పిల్లలు రోజూ మోషన్‌కి పోకపోతే కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇలాంటి పిల్లలకు రోజుకు అయిదుసార్లు విరేచనాలు కావొచ్చు. అయిదు రోజులకు ఒకసారి విరేచనం కావొచ్చు. రెండూ సాధారణమే. కాకపోతే బిడ్డ కొద్దిగా అసౌకర్యంగా ఉన్నట్టు, ఇబ్బందిపడుతున్నట్టు చెప్పారు. అది బహుశా కడుపులో గ్యాస్ ఏర్పడడం వల్ల కలిగి ఉండొచ్చు. ఆరు నెలలలోపు శిశువులకు ఈ సమస్య కూడా సాధారణమైనదే. మీకు డాక్టర్లు ఓరల్ డ్రాప్స్ ఇచ్చారని చెప్పారు. అవి గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అడపాదడపా వాడొచ్చు. ఇంకో ముఖ్యమైన విషయం.. తల్లిపాలు ఇచ్చిన తర్వాత భుజం మీద వేసుకుని ఓ పదిహేను, ఇరవై నిమిషాలు నిటారుగా ఉంచుకుంటే.. తేన్పులు వచ్చి రిలీఫ్‌గా ఉంటుంది.కాకపోతే తల్లి భోజనంలో మసాలాలు, కారాలు తగ్గించుకోవాలి. అలాగని పథ్యాలు చేయాల్సిన అవసరం లేదు. ఆరు నెలల్లోపు పిల్లలు పాలు తాగిన తర్వాత వాంతులు చేసుకుంటే పెరుగులా రావడం సహజం.



సాధారణంగా వాంతి అయినప్పుడు అన్నవాహిక నుంచి ఆహారం బయటపడుతుంది. కానీ ఆరు నెలల్లోపు పిల్లలకు వాంతి అయితే జీర్ణాశయానికి చేరిన పాలు తిరిగి బయటికి వస్తాయి. చిన్న వయసు శిశువుల్లో అన్న వాహికకు, జీర్ణాశయానికి మధ్యన ఉండే కండరాలు బలహీనంగా ఉంటాయి. కాబట్టి జీర్ణాశయం చేరిన పాలు తిరిగి అన్నవాహికలోకి వస్తాయి. అందుకే వాంతి అయినప్పుడు బయటపడిన పాలు పెరుగులా ఉంటాయి. ఆ వాంతులకు కంగారుపడకండి. బిడ్డ బరువు సరిగా ఉండి, హుషారుగా ఉంటే దీనికి ప్రత్యేకమైన చికిత్స అవసరమే లేదు. ఒకవేళ బిడ్డకు వాంతులు ఆకుపచ్చ రంగులో అయితే, పొట్ట అకస్మాత్తుగా ఉబ్బితే వెంటనే డాక్టర్‌కి చూపించాలి. సాధారణంగా వచ్చే పాలలాంటి, పెరుగులాంటి వాంతులకు కంగారుపడాల్సిన అవసరం లేదు. మీ బిడ్డకు గ్యాస్ వల్ల పేగుల్లో నొప్పి కలిగి ఉండి ఉంటుంది. ఇప్పటికే పిల్లల వైద్యులు చూశారు. కాబట్టి కంగారు పడకండి.

# ఈ నడక గుండెకు భరోసా




తిండి కలిగితే కండ కలదోయ్ అన్నట్టే, కొవ్వు పెరిగితే.. గుండె జబ్బు కలుగోయ్ అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. గుండె ఆరోగ్యానికీ, శరీరంలో కొవ్వుకీ సంబంధం ఉంది. గుండెలో ఉన్న సమస్యకు, శరీరంలో ఉన్న కొవ్వుకి ఒకటే పరిష్కారం. వ్యాయామం. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు. గుండె ఆరోగ్యాన్ని పెంచుకునే వ్యాయామం చేస్తూ.. కొవ్వుని తగ్గించేలా కొన్ని నియమాలు పాటిస్తే డబుల్ బెనిఫిట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అదేమిటంటే.. ట్రెడ్ మిల్ మీద కేవలం పరుగే కాక నడకనూ అలవాటు చేసుకోవాలి. రోజువారీగా ట్రెడ్ మిల్ మీద పరుగెత్తే సమయంలో పది నుంచి పన్నెండు శాతం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమయాన్ని నడకకు కేటాయించాలని చెబుతున్నారు. ఆ నడక కూడా ట్రెడ్ మిల్ మీదే. నడకలోనూ వేగం ఉండాలన్నది నిబంధన. గంటకు రెండు నుంచి మూడు మైళ్ల వేగంతో ట్రెడ్ మిల్ స్పీడ్‌ని సెట్ చేసుకోవాలి. ఈ వేగంతో 30నిమిషాల నుంచి 60 నిమిషాల పాటు వాక్ చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే శరీరంలోని కొవ్వు నిల్వలు కరిగిపోవడంతోపాటు రక్తంలోని గ్లూకోజ్ అంతా ఖర్చవుతుందట. కొత్తగా కొవ్వు పేరుకునేకి ఆస్కారమూ ఉండదు. సుదీర్ఘమైన స్పీడ్‌వాక్ గుండె వేగాన్ని మెరుగుపరుస్తుంది. రెండు సమస్యలూ ఉన్నట్లయితే.. మీ వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ సలహా తీసుకున్న తర్వాతే ట్రెడ్ మిల్ మీద ముందడుగు వేయండి.

# పచ్చసొన వద్దనకండి!

గుడ్డులో పచ్చసొన తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని, అది గుండెకు ప్రమాదమని భావించి చాలామంది దాన్ని పకన పెడతారు. మరీ ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు గుడ్డులోని తెల్లసొనను మాత్రమే తిని పచ్చసొనను పారేస్తుంటారు. కానీ పచ్చసొనతో కలిపి తింటేనే గుడ్డు సంపూర్ణ ఆహారం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం తెల్లసొన మాత్రమే తినడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎకువ. తెల్లసొన ఒక ఇన్‌ఫ్లమేటరీ ప్రొటీన్. దీనికి శరీరంలో మంటను కలిగించే స్వభావం ఉంటుంది. దీన్ని పచ్చసొనతో కలిపి తిన్నప్పుడు మాత్రమే అది సమతుల్యమైన, సంపూర్ణ ఆహారంగా మారుతుంది. పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఉంటుందనే కారణంతో దాన్ని అందరూ విలన్‌గా చూస్తారు. కానీ, వాస్తవానికి గుడ్డులోని మెజారిటీ పోషకాలు అందులోనే ఉంటాయి. తెల్లసొనతో పోలిస్తే పచ్చసొనలో విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. మన శరీరానికి అవసరమైన కొలెస్ట్రాల్‌లో దాదాపు 85 శాతం మన కాలేయమే సొంతంగా తయారు చేస్తుంది. కేవలం 15 శాతం మాత్రమే మనం తినే ఆహారం ద్వారా అందుతుంది. శరీరం తనంతట తానుగా తయారు చేసుకునేది ఆరోగ్యానికి ఎప్పుడూ హానికరం కాదు. కణాల నిర్మాణం, హార్మోన్ల ఉత్పత్తి, మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి మెరుగుపడటానికి కొలెస్ట్రాల్ ఎంతో కీలకంగా వ్యవహరిస్తుంది. ఆరోగ్యంగా ఉండాలంటే పచ్చసొనను విస్మరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు బరువు తగ్గాలనుకున్నా, మీ కండరాలు దృఢంగా తయారవ్వాలన్నా గుడ్డును పచ్చసొనతో కలిపి పూర్తిగా తినడమే శ్రేయసరం. మార్కెట్లో దొరికే కృత్రిమ ప్రొటీన్ల కంటే ప్రకృతి సిద్ధంగా ఉత్పత్తి అయ్యే గుడ్డు ద్వారా లభించే పచ్చసొన ఎంతో మేలు చేస్తుంది.



# డిజిటల్ భద్రతే ముఖ్యం!



నేటి డిజిటల్ ప్రపంచంలో.. సోషల్ మీడియా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగమై పోయింది. వినోదంతోపాటు కమ్యూనికేషన్, సృజనాత్మకతలోనూ ఇదే కీలకంగా మారింది. అయితే, పెద్దల వరకు సత్ఫలితాలను అందిస్తున్న సామాజిక మాధ్యమం.. పిల్లలకు లేనిపోని చిక్కులు తెచ్చిపెడుతున్నది. ఈ క్రమంలో 'డిజిటల్ భద్రత'పై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. సోషల్ మీడియా వినియోగానికి '13 ఏళ్లు' అనేది చట్టపరమైన కనీస వయస్సు. అయినప్పటికీ, చాలా సందర్భాల్లో వయసు కన్నా.. అవగాహనే ముఖ్యమని పరిశీలకులు చెబుతున్నారు. దాంతోపాటు భావోద్వేగ, సామాజిక సంసిద్ధత కూడా ఉండాలని అంటున్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. మూడు నుంచి 17 ఏళ్ల పిల్లలలో 99శాతం మంది ప్రతిరోజూ ఎంతోకొంత సమయం స్క్రీన్‌పై గడుపుతున్నారట. ఇక ఆన్‌లైన్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ప్లాట్‌ఫామ్‌గా గుర్తింపున్న యూట్యూబ్‌ను 89శాతం మంది పిల్లలు ఉపయోగిస్తున్నారట. అంతేకాకుండా.. 13 ఏళ్లకన్నా తక్కువ వయసు ఉన్న పిల్లల్లో ఎక్కువ మందికి కనీసం ఒక సోషల్ మీడియా యాప్, సైట్లో సొంత ప్రొఫైల్ ఉన్నదట. ఐదు నుంచి ఏడేళ్ల వయస్సు గల పిల్లల తల్లిదండ్రులలో.. మూడింట ఒకవంతు మంది తమ బిడ్డకు సోషల్ మీడియా ప్రొఫైల్ ఉన్నట్లు చెప్పారు. అదే ఎనిమిది నుండి 11 ఏళ్ల పిల్లలలో.. 60శాతం మంది సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారట. దీన్నిబట్టి.. టీనేజర్లు, ప్రీ టీనేజర్లలో అధికశాతం మంది సోషల్ మీడియాను వాడుతున్నట్లు తేలింది. వీరిలో చాలామంది వినోదం కోసం,


చదువుకు సంబంధించిన విజ్ఞానాన్ని పెంచుకోవడానికే యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో సోషల్‌మీ డియాపై అవగాహన లేమితో లేనిపోని సమస్యల్లో కూరుకుపోతు న్నారు. సైబర్ బెదిరింపులు, గోప్యత, డేటా చోరీలాంటి వాటికి గురవుతున్నారు.

భద్రత, బాధ్యతే ముఖ్యం..: పిల్లలకు ఆన్‌లైన్ భద్రతతోపాటు బాధ్యతగా వ్యవహరించడంపై అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ భద్రత, ఫొటోలు, వీడియోలను పంచుకోవడంతోపాటు హానికరమైన కంటెంట్‌ను గుర్తించడంలో వారికి సహాయపడాలి. దీనివల్ల సైబర్ దాడులు, ఏఐ మార్ఫింగ్ ప్రమాదాలను పిల్లలు అర్థం చేసుకుంటారు. అప్పుడే, సురక్షితమైన ఎంపికలు చేసుకోవడానికి సన్నద్ధమవుతారు. సామాజిక మాధ్యమాల్లోనూ సురక్షితంగా ఉంటారు. అంతేకాకుండా.. సోషల్ మీడియాను సురక్షితంగా ఉపయోగించినప్పుడే.. దాని నుంచి ప్రయోజనాలను పొందగలుగుతారు. లేకుంటే.. పిల్లలు క్రూరమైన, హింసాత్మక, లైంగికపరమైన చిత్రాలను చూసే అవకాశం ఉంటుంది. ఇది వారి ప్రవర్తనపై దుష్ప్రభావం చూపుతుంది. ఇక చాలా సందర్భాల్లో తెలియకుండా తీసిన ఇబ్బందికరమైన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్నీ పంచుకుంటున్నారు. ఫలితంగా, సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు.

ఈ సూచనలు పాటించాల్సిందే!: పాస్‌వర్డ్‌లు, లాగిన్ వివరాలను గోప్యంగా ఉంచాలి. వాటిని స్నేహితులతోనూ పంచుకోవద్దు.

పబ్లిక్ వై-ఫైకి కనెక్ట్ అయినప్పుడు సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ ఖాతాలను ఉపయోగించవద్దు. ఇతర కంప్యూటర్లు, గ్యాడ్జెట్లను ఉపయోగించిన తర్వాత..అన్ని ఖాతాల నుంచీ తప్పకుండా లాగ్ అవుట్ అవ్వాలి. అన్నిటికన్నా ముఖ్యంగా.. పాప్ అప్‌లపై క్లిక్ చేయవద్దు. అవి అశ్లీలత, స్కామ్ సైట్‌లకు దారితీయవచ్చు. తెలిసిన వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను మాత్రమే అంగీకరించాలి. ఆన్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే.. స్క్రీన్‌షాట్ తీసుకొని, వాటి గురించి పెద్దలతో మాట్లాడాలి.

# కావాల్సినంత క్యాల్షియం




క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుందని చాలామంది పిల్లలకి ఉదయాన్నే పాలు తాగిస్తుంటారు. పిల్లలేకాదు పెద్దవారు కూడా క్యాల్షియం కోసం పాలు తాగుతుంటారు. వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో బలం తగ్గుతుంది కాబట్టి వృద్ధులను కూడా పాలు తాగమని చెబుతుంటారు. క్యాల్షియం సప్లిమెంట్స్ కూడా వాడుతుంటారు. పాలతోపాటు ఈ ఆహార పదార్థాలకు మీ డైట్‌లో చోటివ్వండి. కావాల్సినంత క్యాల్షియం లభిస్తుంది. పాలు తాగకపోతే క్యాల్షియం అందదని చాలామంది అభిప్రాయం. కానీ, అది వాస్తవం కాదు. 100 మి.లీ. ఆవుపాల ద్వారా 120 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. అదే 100 మి.లీ. గేదెపాలు తీసుకుంటే.. 210 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. ఇంతకు రెట్టింపు క్యాల్షియం అందించే పదార్థాలు ఉన్నాయి. అవేంటంటే..

బెస్ట్ సోర్స్: ఉలవల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. 100 గ్రా. ఉలవల ద్వారా దాదాపు 290 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. నాన్ వెజ్, పాలు తీసుకోలేని వారికి ఉలవలతో క్యాల్షియం అవసరాలు తీరిపోతాయి.

ఎముకలు ఉక్కులా: రాగులు కూడా క్యాల్షియం రిచ్ సోర్స్. దాదాపు 100 గ్రా. రాగుల ద్వారా 350 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. రాగి జావ, రాగి ఇడ్లీ, దోశ, రొట్టె ఇలా రకరకాల రూపాల్లో రాగులు టేస్ట్ చేయొచ్చు. వీటి వల్ల ఎముకలు ఉకులా మారతాయి.

అంతకుమించి: 100 గ్రా. తోటకూరలో దాదాపు 400 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. ఆకుకూరల్లో క్యాల్షియం సమృద్ధిగా అందించే వాటిలో తోటకూర ముందువరుసలోఉంటుంది.

రుచికి రుచి: 100గ్రా. మునగాకులో 440 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. మునగాకు పప్పు,తాలింపు, పొడి ఇలా రకాలుగా తినొచ్చు.

సూపర్‌ఫుడ్: అవిసె ఆకులు కూడా క్యాల్షియాన్ని అందించే సూపర్ ఫుడ్‌గా చెబుతుంటారు. దాదాపు 100 గ్రా. అవిసె ఆకుల్లో 1200 మి.గ్రా. కాల్షియం ఉంటుంది. ఎలాగైనా తినొచ్చు: 100 గ్రా. నల్లనువ్వుల్లో 1450 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది.

# కిచ్‌కిచ్ తగ్గించుకోండి ఇలా

గొంతులో కిచ్‌కిచ్ ఉంటే ఇబ్బందే. మాటిమాటికీ గొంతు సవరించుకోవడం, కఫాన్ని ఉమ్మివేయడం కష్టమే. కొంతమందైతే కఫాన్ని మింగేస్తారు కూడా. అది చాలా ప్రమాదకరం. గొంతులో గరగరగా ఉందంటే మన శరీరంలోకి ప్రవేశించే బ్యాక్టీరియాలతో వ్యాధి నిరోధక శక్తి పోరాడుతున్నట్లు అర్థం. వ్యాధి నిరోధక శక్తి ఓడిపోతున్నప్పుడు మ్యూకస్ (కఫం లేదా శ్లేష్మం) ఏర్పడుతుంది. అది గొంతుకు అడ్డం పడుతుంది. జలుపు, జ్వరం, అలెర్జీలు, కాలుష్యం, పొగ వంటివి గొంతు గరగరకుదారితీస్తాయి.

దీనివల్ల వచ్చేదగ్గు రెండువారాల కంటే ఎక్కువ ఉంటే ప్రాణాంతకమైన క్షయ వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే మనం గొంతులో కిచ్‌కిచ్ అంతు చూద్దాం. అందుకు మందులతో పనిలేదు. మన వంటింట్లో ఉంటే చిట్కాలేంటో చూద్దాం.

పసుపు, పాలు : గోరు వెచ్చని పాలలో అర టీస్పూన్ పసుపు కలిపి తాగాలి. కాస్త నెయ్యి కూడా వేసుకోవచ్చు. గొంతులో గరగర మాయమై గొంతులో హాయిగా ఉంటుంది. అల్లం, దాల్చిన చెక్క : అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీపొడి కలిపి టీ పెట్టుకొని తాగేయాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది. కాస్త తేనె కూడా కలుపుకోవచ్చు.



అల్లం టీ: అల్లంలో బ్యాక్టీరియాలను చంపే గుణాలున్నాయి. గొంతులో మంటను తగ్గించే లక్షణాలున్నాయి. కాబట్టి అల్లాన్ని మెత్తగా నూరి టీలో కలిపి ఐదు నిమిషాలు మరిగించి తాగితే గొంతులో కిచ్‌కిచ్ మాయం.పుదీనా టీ : పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి, ఆ నీటిని తాగేయాలి. అంతే.. మ్యూకస్ పెట్టే బెడద సర్దుకోవాల్సిందే.చామంతి టీ : ఇది పెద్దగా తెలియకపోవచ్చు. నిజానికి ఇది కూడా బాగా పనిచేస్తుంది. కొన్ని చామంతి రేకుల్ని నీటిలో వేసి మరిగించి తాగేయాలి. ఈ టీ బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. దీనిలో తేనె కూడా కలుపుకోవచ్చు.

# బర్డ్ ఫ్లూ పై ఆందోళన వద్దు.!




రాయచోటి,: బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లాలోని పుంగనూరు ,మదనపల్లె జిల్లాలోని బర్డ్ ఫ్లూ సోకిన పలు కోళ్ల ఫారాలను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు .కోళ్ల ఫారం యజమానులతో జిల్లా కలెక్టర్ వారి కష్టాలను బర్డ్ ఫ్లూ పై తీసుకుంటున్న చర్యలను ఈ బర్డ్ ఫ్లూ భవిష్యత్తులో రాకుండా పూర్తిస్థాయిలో నివారించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో విపులంగా చర్చించారు .అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూబర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తా మనీ హామీ ఇచ్చారు.అంతేకాకుండా మదనపల్లెలోబర్డ్ ఫ్లూ పై కంట్రోల్ రూమ్ ఏర్పాటు. చేశామని చెప్పారు.కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు దాదాపు శూన్య మనీ వివరించారు100 డిగ్రీలకు పైగా వేడి చేసిన మాంసంలో బర్డ్ ఫ్లూ వైరస్ ఉండదనితెలిపారు.అన్నమయ్య జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలంలోని రెండు కోళ్ల ఫారాలలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదుం మండలంలోని పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాలలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో కోళ్లను ఖననం చేయడానికి జిల్లా కలెక్టర్ పశుసంవర్ధక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.సదుం మండలంలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై చర్యలు తీసుకునేందుకు పశు సంవర్ధక శాఖకు తగిన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల సమన్వయంతో.సదుం మండలం నుండి ఇతర ప్రాంతాలకు కోళ్ల సరఫరా జరగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు బర్డ్ ఫ్లూ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సదుం మండలం మినహా మిగతా ఏ మండలాలలో అసాధారణ కోళ్ళ మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ.అన్నమయ్య జిల్లా సదుం మండలం పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె, కంభం వారి పల్లె, గ్రామాలకు చెందిన ముగ్గురు రైతుల కోళ్ల ఫారాలలో అనూహ్యమైన సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవించగా అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ మొదటి రెండు కోళ్ల ఫారాల నుండి చనిపోయిన కోళ్ల శాంపుల్స్ ను మధ్యప్రదేశ్ భోపాల్ లోని హై సెక్యూరిటీ ల్యాబ్ కు పంపగా చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లుగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో... పుత్తవారిపల్లె మరియు అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాల లోని కోళ్లను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ద్వారా బ్లీచింగ్ పౌడర్ సున్నం లను ఉపయోగించి కోళ్లను ఖననం చేసినట్లుగా పేర్కొన్నారు. కంభం వారి పల్లె గ్రామంలోని కోళ్ల ఫారానికి చెందిన కోళ్ల శాంపిల్స్ యొక్క నివేదిక భోపాల్ నుండి రావాల్సి ఉందని నివేదిక వచ్చిన వెంటనే దానిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ మరియు అన్నమయ్య జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆటోల ద్వారా టామ్ టామ్ వేయిస్తున్నామని పేర్కొన్నారు. కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు చాలా చాలా తక్కువ అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూరు డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో వేడి చేసిన చికెన్ ను తినడం వల్ల ఎటువంటి సమస్య ఉండదని ప్రజలు ఈ విషయంలో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అమ్మగారిపల్లె పుత్తవారిపల్లె గ్రామాలలో కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేశామని, ప్రజలు ఎవరైనా కోళ్లలో అసాధారణ మరణాలు సంభవించడం గమనిస్తే వెంటనే 7013914401, (అమ్మవారి పల్లి), 9398262752, (పుత్తవారిపల్లె) నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలపవచ్చని పేర్కొన్నారు.

## హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు

# భూసేకరణ అడుగులు

హైదరాబాద్ : హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఈ భాగానికి త్వరలో టెండర్లు పడనుండగా.. 1,895 హెక్టార్ల భూసేకరణ జరగాల్సి ఉంది. వీటితో పాటు.. ఆర్మూర్–మంచిర్యాల, మహబూబ్‌నగర్ మార్గాల్లో 1,372 హెక్టార్లకు గానూ కేవలం 255 హెక్టార్లే పూర్తయ్యాయి. భూసేకరణ ప్రక్రియ వేగవంతమైతేనే ఎన్‌హెచ్ఏఐ పనులు పట్టాలెక్కనున్నాయి.తెలంగాణ గేమ్ ఛేంజర్‌గా హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల కల్పనలో అత్యంత కీలకమైన ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ భావిస్తోంది. ఆర్ఆర్ఆర్‌తో పాటు పలు జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారింది.హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులు ప్రారంభించేందుకు ఎన్‌హెచ్ఏఐ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1,895 హెక్టార్ల భూమి అవసరం. కాగా ఇప్పటికే 1,862 హెక్టార్లకు సంబంధించి 3డీ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో.. మరోసారి టెండర్లను ఆహ్వానించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నగరం చుట్టూ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.రాష్ట్రంలో కేవలం రీజినల్ రింగు రోడ్డే కాకుండా, మరిన్ని కీలక జాతీయ రహదారుల పనులు కూడా భూసేకరణ గండం దాటాల్సి ఉంది. ఆర్మూర్ నుండి మంచిర్యాల వరకు, మహబూబ్‌నగర్ పరిధిలో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. జగిత్యాల– మంచిర్యాల, మహబూబ్‌నగర్– గూడెబల్లూర్, ఆర్మూర్– జగిత్యాల, జగిత్యాల– కరీంనగర్ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నాలుగు రహదారుల కోసం మొత్తం 1,372 హెక్టార్ల



భూమి అవసరం. ఇప్పటి వరకు కేవలం 255 హెక్టార్లు మాత్రమే సేకరించారు. మిగిలిన భూసేకరణ వివిధ దశల్లో పెండింగ్‌లో ఉండటం ప్రాజెక్టుల నిర్మాణం ఆటంకంగా మారింది.జగిత్యాల–కరీంనగర్ రహదారి విస్తరణకు సంబంధించి రైల్వే శాఖ నుంచి రావాల్సిన అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. మరోవైపు, ఈ రహదారుల పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయింది. పనుల పర్యవేక్షణ కోసం త్వరలోనే కన్సల్టెన్సీ సంస్థలను ఎంపిక చేయాలని ఎన్‌హెచ్ఏఐ డిసైడ్ అయింది. భూసేకరణ కొలిక్కి వస్తేనే కన్సల్టెన్సీల నియామకం, క్షేత్రస్థాయి పనులకు అడ్డంకులు తొలిగిపోతాయని అధికారులు చెబుతున్నారు.ఈ ప్రాజెక్టుల కోసం భారీ నిధులను కేటాయించినప్పటికీ..
రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను ఎంత వేగంగా పూర్తి చేస్తుందనే దానిపైనే వీటి భవితవ్యం ఆధారపడి ఉందని నిపుణులు చెబుతున్నారు. భూసేకరణ పూర్తయి, క్లియరెన్స్ లభిస్తేనే కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఆర్ఆర్ఆర్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే తెలంగాణ ఆర్థిక ముఖచిత్రం మారడమే కాకుండా.. జిల్లాల మధ్య కనెక్టివిటీ కూడా పెరుగుతుందని అంటున్నారు.

# యాప్‌లపై టెక్ నిపుణులేమంటున్నారంటే..?!



దేశ భద్రత పేరుతో పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు కేంద్ర ప్రభుత్వం భంగం కలిగిస్తోందా?! ఎందుకంటే పార్లమెంటు సమావేశాల సందర్భంగా మోడీ సర్కార్ సంచార్ సాథీ యాప్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించింది. అయితే ప్రతిపక్షాల నిరసనలతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్టు ప్రకటించింది. ఇదే కాదు.. నవంబర్ 24 కేంద్రం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం 2023లో నోటిఫై చేసిన నిబంధనలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్నాయని జర్నలిస్టు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో కేంద్రం అమలు చేయాలనుకున్న ఈ విధానాలు పూర్తిగా సమాచారానికి సంబంధించినవే కావడం గమనార్హం. కేంద్రం తేవాలని ప్రయత్నించిన సంచార్ సాథీ యాప్ ద్వారా పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు ముప్పు వాటిల్లుతుందనేది బహిరంగ సత్యం. అయితే దీనిపై కేంద్రం చెబుతున్న మాటలు మరోలా ఉన్నాయి. పొరపాటున పోగట్టుకున్న లేదా దొంగిలించిన స్మార్ట్‌ఫోన్‌లను బ్లాక్ చేయడానికి, వాటిని ట్రాక్ చేయడానికి ఈ సంచార్ సాథీ యాప్ ఉపయోగపడుతుందని.. అందుకే ఈ యాప్‌ని తేవడానికి ప్రయత్నించినట్లు కేంద్రం చెప్పింది. అయితే అసలు ఈ యాప్‌పై టెక్ నిపుణులు ఏమంటున్నారంటే.. ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయాయి. ఇవి వ్యక్తిగత విషయాలను చాలా గోప్యంగా ఉంచుతాయి. అందుకే.. స్నేహితులకు, కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు చెప్పుకోలేని సమాచారాన్ని కూడా ఇవి భద్రంగా ఉంచుతాయి. అసలు చాలామంది వినియోగదారులకు తమ ఫోన్లలో ఇలాంటి యాప్ ఒకటి ఉందని వారికి తెలియకపోవచ్చు. కొద్దిమంది మాత్రమే ఫోన్లలో ఈ యాప్ గురించి శోధించి.. తొలగించడానికి ప్రయత్నిస్తారు. ఈ యాప్ వల్ల జరిగే ప్రయోజనం కంటే.. వినియోగదారులకు నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఈ యాప్ ద్వారా వ్యక్తిగత డేటాను సులభంగా పొందవచ్చు. కాల్ లాగ్‌లు, పరిచయాలు, మీరు ఎక్కడున్నది? మీ చరిత్ర, మీరు మాత్రమే గోప్యంగా ఉంచుకునే సమాచారాన్ని కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీరు పంపే సందేశాల్ని ఈ యాప్ ద్వారా సేకరించ వచ్చు. అలాగే ఈ యాప్ వినియోగదారుల హక్కుల్ని కూడా దెబ్బతీ స్తుంది. ఇది ఫోన్ పనితీరుపై కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే స్మార్ట్‌ఫోన్లను రక్షించడానికని చేసే ప్రయత్నం.. మెరుగైన పద్ధతుల్లో ఉండాలి. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వ్యవస్థను బలోపేతం చేయవచ్చు. తప్పనిసరి అని భావిస్తే.. యాప్‌కు కోడ్ తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు.

# టీడీపీ గూటికి సిద్ధా..!



ఒంగోలు, : వైయస్సార్ కాంగ్రెస్(పార్టీకి గుడ్ బై చెప్పారు ఒక మాజీ మంత్రి. అయితే ఏడాది కిందట ఆయన రాజీనామా చేశారు. కానీ ఇంతవరకు ఏ పార్టీలో చేరలేదు. ఇష్టమైన పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. మరో పార్టీలో చేరే ఉద్దేశం లేదు. దీంతో గత ఏడాదికాలంగా ఆయన భగీరథ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే అధినేత చంద్రబాబును కలిశారు. కానీ లోకల్ నాయకత్వం నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇప్పుడు స్థానిక నేతలను సముదా యించారు చంద్రబాబు. దీంతో ఆ నేతకు పార్టీలో చేర్పించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఆ మాజీమంత్రి తెలుగుదేశం పార్టీలో చేరుతారని సొంత జిల్లాలో ప్రచారం జరుగుతోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అలానే ఆ పార్టీకి రాజీనామా చేశారు మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన తరువాత రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు. అలా చేరిన క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకత్వం ఆయనకు ఒక హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే దర్శి టికెట్. గతంలో అదే నియోజకవ ర్గంలో నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అందుకే ఆ టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ జగన్మోహన్ రెడ్డి అందుకు అంగీకరించలేదు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు అయితే అయిష్టంగానే ఆ పార్టీలో కొనసాగారు రాఘవరావు. ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన వెంటనే రాజీనామా ప్రకటించారు. చంద్రబాబుతో ఉన్న తన పాత సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ పార్టీలోకి వస్తానని కోరారు. అయితే స్థానిక నాయకత్వం నుంచి అభ్యంతరాలు ఉండడంతో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలో సీనియర్ మోస్ట్ లీడర్ సిద్దా రాఘవరావు. 1999 నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. 2007లో చంద్రబాబు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. 2014లో దర్శి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచేసరికి తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు రాఘవరావును. ఐదేళ్లపాటు మంత్రి పదవిలో కొనసాగిన ఆయనను 2019 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి ఎదురయ్యేసరికి రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడికి వెనక్కి తగ్గారు. దర్శి టిక్కెట్ హామీతో ఆ పార్టీలో చేరారు. కానీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. పార్టీ ఓడిపోయేసరికి రాఘవరావుకు స్వేచ్ఛ లభించింది. అందుకే ఇప్పుడు మాతృ పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నం కూడా ఫలించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలుగుదేశం పార్టీలోకి రావడం ఖాయమని తెలుస్తోంది. కానీ దర్శికి ఇప్పటికే టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు గొట్టిపాటి లక్ష్మి. మొన్నటి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇప్పుడు రాఘవరావు వస్తుండడంతో లక్ష్మి పరిస్థితి ఏంటి అనేది తెలియడం లేదు. చంద్రబాబు ఇద్దరికీ న్యాయం చేస్తారని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# మానవ వ్యర్థాలతో క్యాన్సర్ ఔషధం!



న్యూఢిల్లీ : క్యాన్సర్‌కు మానవ వ్యర్థాలతో ఔషధాన్ని కెనడా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వీటిని 'ఫెకాల్ కాప్సూల్స్' అని, శాస్త్రీయ భాషలో ఫెకాల్‌మైక్రోబయోటా లేదా ఎఫ్ఎంటి అని పిలుస్తారు. ఆరోగ్యవం తుడైన మనిషి వ్యర్థాలను ఫ్రీజ్ చేసి, ఎండపెట్టి వాటిని ఎఫ్ఎంటి క్యాప్సూల్స్‌గా తయారు చేస్తారు. ఈగోలీలు పొట్టలోకి చేరి మంచి సూక్ష్మజీవులను పెంపొందిస్తాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో సాధారణంగా వాడే ఔషధాలతో పోలిస్తే ఈ ఎఫ్ఎంటి గోలీలు 40–45 శాతం ఎక్కువ ప్రయోజనకరంగా పనిచేస్తాయి. వీటిని సాధారణ క్యాన్సర్ ఔషధాలతో కలిపి తీసుకొంటే 80 శాతం ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. చర్మ క్యాన్సర్ విషయానికి వస్తే ఎఫ్ఎంటి పిల్స్‌ను సాధారణ ఔషధాలతో కలిపి తీసుకొంటే 79 శాతం అధిక ప్రయోజనం చేకూరుతుంది.

## అనంత, శ్రీ సత్యసాయి జిల్లాలకు మహర్దశ

అనంతపురం, : ఇటీవల కేంద్రం రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్లలో ఏపీకి కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కూడా ఖరీదైన ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ సర్వేతో పాటుగా పరిశోధనలు చేపట్టారు. అలాగే కడప జిల్లాలో కూడా ఖనిజాలు ఉన్నాయి.రాయలసీమను రతనాల సీమగా పిలుస్తారు.. అంతటి పేరు పొందిన ప్రాంతంలో ఇప్పటికి వజ్రాల వేట జరుగుతోంది. వర్షాకాలంలో పొలాల్లో వజ్రాలు బయటపడుతుంటాయి. అయితే రాయలసీమలో రత్నాల కంటే ఖరీదైన ఖనిజ సంపద ఉందని తెలుస్తోంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు స్థానం దక్కింది. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ చేయనున్నట్లు తెలుస్తోంది.అనంతపురం జిల్లాలో 2023లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పలు ప్రాంతాల్లో కొన్ని ఖనిజాలు (నియోబియం, నియోడైమియం, సిరియం, లాంథనం, ప్రాసోడైమియం,స్కాండియం, జిర్కోనియం, లిథియం) ఉన్నట్లు గుర్తించారట. ఈ ఖనిజాలను ఎయిర్‌క్రాఫ్ట్, స్మార్ట్‌ఫోన్లు, విండ్ టర్బైన్స్, కంప్యూటర్లు వంటి వాటిలో కూడా ఉపయోగిస్తారని చెబుతున్నారు.

# ప్రాణాల మీదకు డిజిటల్ వ్యసనం!

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ముగ్గురు టీనేజ్ సిస్టర్స్ ప్రాణాలు తీసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇది టీనేజర్ల ఇంటర్నెట్ వాడకంపై, ముఖ్యంగా నియంత్రణ లేని ప్రపంచంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. చిన్న పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు వయో పరిమితులు విధించే విషయంలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వయసు ఆధారంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగానికి అనుమతి ఇచ్చే విషయంలో ఇటీవల ఆర్థిక సర్వే పలు సూచనలు చేసిందని, ఆ సర్వే అభిప్రాయాలన్నింటిని ప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ చెప్పారు. వయసు పరిమితి విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఇంటర్నెట్ కార్పొరేషన్ ఫర్ అసైన్డ్ నేమ్స్ అండ్ నంబర్స్ (ఐసీఏఎన్ఎన్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పిల్లలు ఇంటర్నెట్‌ను వినియోగించే విషయంలో ఆస్ట్రేలియా తరహా చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు వయసు నిబంధనలతో పాటు డిజిటల్ వ్యసనాన్ని తగ్గించడానికి ఆన్‌లైన్ టీచింగ్‌ను కూడా తగ్గించాలని ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సూచించింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా వయసు ధ్రువీకరణను చేయాలని, డిజిటల్ వ్యసనానికి దూరంగా ఉంచేందుకు వీలుగా పిల్లలకు విద్యా విషయాలను అందించే సులువైన పరికరాలను ప్రోత్సహించాలని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. హానికరమైన కంటెంట్‌కు పిల్లలు ప్రభావితమవుతారని, వయసు ధ్రువీకరణ బాధ్యతను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లే వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ సర్వే విడుదల సందర్భంగా చీఫ్ ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ, ఇంటర్నెట్ వినియోగానికి వయసు నిబంధనలు తెచ్చే ఆలోచనలో ఆంధ్రప్రదేశ్, గోవా ప్రభుత్వాలు ఉన్నట్లు తమకు తెలిసిందన్నారు. ఇటీవల ఘజియాబాద్‌లో ముగ్గురు బాలికలు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం, కొరియా కల్చర్ మోజుపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఆన్‌లైన్ కంటెంట్‌కు పిల్లలను దూరంగా ఉంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.వయసులో పెద్ద, జాబ్ స్ట్రెస్ వల్ల ఇలా చేసుకున్నారా అంటే కాదు. నిషికా (16), ప్రాచి (14), పాఖీ (12). కనీసం యుక్తవయసుకు కూడా రాకముం దే.. బుధవారం తెల్లవారు జామున వారి ఉంటున్న తొమ్మిదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి కారణం ఏంటంటే..ఈ అమ్మాయిలు ఆన్‌లైన్ గేమ్స్‌కు, కొరియన్ పాప్ కల్చర్‌కు ప్రభావితమయ్యారని.. దాంతోవారి తండ్రిమొబైల్ ఫోన్లనుఎక్కువగా వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారని మీడియా నివేదికలు చెప్తున్నాయి. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తుండగా.. మైనర్ల స్క్రీన్ సమయం, డిజిటల్ యుగంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ పాత్రపై విస్తృత చర్చ మళ్లీ మొదలైంది.మానసిక ఆరోగ్య నిపుణులు ప్రకారం.. కౌమారదశ అనేది చాలా సున్నితమైన దశ. కాబట్టి వారి డిజిటల్ అలవాట్లను తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించడం చాలా అవసరమని నొక్కి చెబుతున్నారు. ఆర్టిమిస్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో సీనియర్ కన్సల్టెం ట్, సైకియాట్రీ హెడ్ డాక్టర్ రాహుల్ చందోక్ ఏమి చెప్పారంటే.. కోవిడ్–19 మహమ్మారి కారణంగా ఘజియాబాద్ సోదరీమణులు పాఠశాలకు వెళ్లలేదనే నివేదికలను ప్రస్తావించారు.
"పిల్లలకు సాధారణ కార్యకలాపాలు లేనప్పుడు.. ఆన్‌లైన్, మొబైల్ గేమ్‌ల ఉచ్చులో పడటం చాలా సులభం అవుతుంది" అని డాక్టర్ చందోక్ ంఃఖతో తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు తరచుగా భావోద్వేగాలకు ఒక మార్గంగా మారుతాయని అన్నారు. గురుగ్రామ్‌లోని సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్‌లో చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకియాట్రిస్ట్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రమిత్ రస్తోగి మాట్లాడుతూ.. మితంగా ఫోన్ వాడటం వల్ల పిల్లలు తమ స్నేహితులతో రిలేషన్స్ కొనసాగించగలుగుతారని అన్నారు. 6 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవ డంపై దృష్టి పెడతారు. అయితే 13, 18 సంవత్సరాల మధ్య గుర్తింపు ఏర్పడే దశ.. ఇది పరస్పర భావోద్వేగాలను కోరుకుంటుందని వివరించారు.' 'గుర్తింపు సరిగ్గా రాకపోయినా, చేసిన పనికి తగిన అప్రిసియేషన్ లేకపోయినా.. అది టీనేజర్లను బలహీనపరుస్తుంది" అని రస్తోగి అన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం గురించి మాట్లాడు తూ.. "ఆటోమేటిక్"గా అనిపించే అనుభవాలు.. తక్కువ ఎఫర్ట్స్‌తో తక్షణమే వచ్చే గుర్తింపుసంతృప్తిని అందిస్తాయని పేర్కొన్నారు.ము గ్గురు సోదరీమణులు సామాజికంగా దూరంగా ఉన్నారని వచ్చిన నివేదికలను ప్రస్తావిస్తూ.. ఒంటరితనం తరచుగా టీనేజర్లను జీవితా నికి దూరం చేస్తుందని అన్నారు. "ఒక టీనేజర్ సమాజానికి ఎంత దూరంగా ఉంటే.. జీవితానికి రంగులు తెచ్చే విషయాలకు అంతగా దూరమవుతారు, స్క్రీన్‌కి దగ్గర అవుతారని" అని ఆయన అన్నారు. ఒంటరిగా, స్నేహితులకు దూరంగా లేదా తల్లిదండ్రుల శ్రద్ధకు దూరంగా ఉన్న పిల్లలు దీనికి ఎక్కువ గురవుతారని చందోక్ అభిప్రా యపడ్డారు. అలా పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్, ఇతర వ్యాపకాలపై ఎక్కువ దృష్టి సారిస్తారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచిస్తున్నారు నిపుణులు. వారి సేఫ్టీగా కోసం మొబైల్ ఇవ్వాలనుకుంటే అది కరెక్ట్ కాదని.. మొబైల్ అవసరం లేని పరిస్థితిని ఇంటా, బయట క్రియేట్ చేయాలని చెప్తున్నారు. పాఠశాలకు వెళ్తూ, బయట ఫ్రెండ్?షిప్ చేస్తూ, పరీక్షలు రాసే, సాధారణ కార్యకలాపాల్లో పాల్గొనే పిల్లలు నార్మల్?గా ఉంటారని గుర్తించాలని రస్తోగి తల్లిదండ్రులకు సూచించారు. అలాగే తల్లిదండ్రుల పెంపకం కూడా పరిస్థితులకు అనుగుణంగా మారవలసి ఉంటుందని.. తెలిపారు. అన్ని విషయాల్లో కఠినంగా ఉండనవసరం లేదని.. కొన్ని విషయాల్లో వారికి ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని.. అలా అని పూర్తిగా వదిలేయకూడదని చెప్తున్నారు.




# రెమ్యునరేషన్ లేకుండా సినిమా



సినిమా కళాత్మక వ్యాపారం. ఇక్కడ తారలు తమ ఇమేజ్‌ను బట్టి పారితోషాకాల్ని డిమాండ్ చేస్తుంటారు. ఇక అగ్ర తారలైతే రెమ్యునరేషన్ విషయంలో ఏమాత్రం రాజీపడరు. కానీ ఈ ధోరణికి భిన్నంగా అగ్ర కథానాయిక తమన్నా 'ఓ రోమియో' అనే హిందీ సినిమాలో అతిథి పాత్రలో నటించినందుకుగాను ఎలాంటి పారితోషికాన్ని తీసుకోలేదట. ప్రస్తుతం ఈ విషయం బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. షాహిద్‌కపూర్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రచార కార్యక్రమాల సందర్భంగా దర్శకుడు విశాల్ భరద్వాజ్ రెమ్యునరేషన్ల అంశం గురించి మాట్లాడారు. కథానాయిక తమన్నా, 12th ఫెయిల్' ఫేమ్ విక్రాంత్ మస్సే ఈ సినిమాలో అతిథి పాత్రల్లో నటించారని, తనతో ఉన్న స్నేహసంబంధాలతో పాటు ఓ మంచి కథకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారిద్దరూ పైసా పారితోషికాన్ని తీసుకోకుండానే నటించారని, ఈ రోజుల్లో అంతటి ఉదార స్వభావం ఉన్న వారు అరుదని ప్రశంసించారు.

గెస్ట్‌రోల్ కోసం కొన్ని రోజులే కేటాయించినా.. ఇప్పుడున్న వ్యాపార దృక్కోణంలో ఉచితంగా నటించడం గొప్ప విషయమని బాలీవుడ్ వర్గాలంటున్నాయి. గత ఏడాది వచ్చిన 'ఓదెల-2' తర్వాత తెలుగులో తమన్నా మరే చిత్రానికి సైన్ చేయలేదు.

# శాకుంతలం గట్టి దెబ్బనే కొట్టింది



భారీ చిత్రాలను సమర్థవంతంగా తెరకెక్కించగల దర్శకుల జాబితాలో గుణశేఖర్ కనిపిస్తారు. జానపదాలు .. పౌరాణికాలపై కూడా ఆయనకి మంచి పట్టుంది. అందుకు నిదర్శనంగా ఆయన రూపొందించిన రుద్రమదేవి .. శాకుంతలం సినిమాలు కనిపిస్తాయి. అనుష్క ప్రధానమైన పాత్రగా ఆయన రుద్రమదేవిఁని తెరకెక్కిస్తే, సమంత ప్రధానమైన పాత్రగా శాకుంతలం ఆవిష్కరించారు. 2023లో శాకుంతలం సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రీసెంటుగా ఒక ఇంటర్వ్యూలో గుణశేఖర్ మాట్లాడుతూ .. రుద్రమదేవి సినిమా వలన నాకు నష్టాలు రాలేదు. ఆ సినిమా వలన నాకు ఎలాంటి అప్పులు కాలేదు. కానీ శాకుంతలం మాత్రం గట్టి దెబ్బనే కొట్టింది. ఈ సినిమా ఓటీటీ వైపు నుంచి ఇబ్బంది పెట్టలేదు గానీ, థియేట్రికల్ వైపు నుంచి దెబ్బకొట్టింది. ఈ సినిమా వలన దిల్ రాజు గారు .. నేను ఇద్దరం కూడా సమానంగా రిస్క్ ఫేస్ చేయవలసి వచ్చింది. రావాల్సింది రాకపోవడం వలన ఇబ్బంది పడ్డాము అని అన్నారు. శాకుంతలం సినిమాపై వచ్చిన ఎమోంట్ తో నేను తీర్చవలసినవి కొన్ని ఉన్నాయి.

ఆ సినిమా ఆ అవకాశం ఇవ్వకపోవడం వలన, తీర్చవలసినవి ఇప్పటికీ అలా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఎంతో కొంత అప్పు ఉంటేనే బెటర్ అని నేను అనుకుంటూ ఉంటాను. లేదంటే రిలాక్స్ అవుతామనే భయం నాకు ఉంది. అందువలన నేను పూర్తిగా సేఫ్ జోన్ లోకి వెళ్లకుండా, కొంత రిస్క్ చేస్తూనే ఉంటాను.. అని అన్నారు.

# బాలకృష్ణపై నటి లయ ఆసక్తికర కామెంట్స్..!

అమాయకమైన చిరునవ్వు, చక్కని నటనతో నటి లయ ఆ రోజుల్లో కుర్రకారు మనసు గెలుచుకున్నారు. అచ్చ తెలుగు అమ్మాయి అయిన లయ ఆ తర్వాత పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయిపోయారు. ఇప్పుడు చాలా ఏళ్ల తర్వాత నటిగా ఆమె తన సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టారు. హీరో శివాజీ, లయ జంటగా రూపొందిన ‹సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని› చిత్రం ఈ నెల 12 నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో లయ మాట్లడుతూ నటసింహం బాలకృష్ణ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాలయ్య సినిమా ‹విజయేంద్రవర్మ›లో లయ హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా సమయంలో బాలకృష్ణతో ఏర్పడిన అనుబంధాన్ని ఆమె పంచుకున్నారు. బాలయ్యగారు సెట్లో ఉంటే ఆ ఎనర్జీ వేరుగా ఉంటుందని లయ అన్నారు. ఆయన ఎంతో డిసిప్లిన్ గా ఉంటారని, అదే సమయంలో సహ నటీనటులతో ఎంతో సరదాగా జోకులు వేస్తూ అందరినీ నవ్విస్తుంటారని చెప్పారు. ఆయనతో కలిసి నటించడం తనకు దక్కిన గౌరవం అని అన్నారు. అవకాశం వస్తే మరోసారి ఆయనతో కలిసి నటించాలనేది తన కోరిక అని చెప్పారు. లయ కోరికను ఏ దర్శకుడైనా నెరవేరుస్తారేమో వేచిచూడాలి.



# 'వారణాసి'తో వరల్డ్ సినిమా లక్ష్యం..


## రాజమౌళి మహేష్ బాబు ప్రాజెక్ట్‌లో మరో షాకింగ్ ఎలిమెంట్!




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కలయికలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' పై అంచనా లు రోజురోజుకీ పెరుగుతున్నాయి. భారతీయ సినిమాను అంతర్జాతీ య స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నారు. హాలీవుడ్ ప్రమాణాలకు తగ్గ సాంకేతిక విలువలు, కథనంతో ఈ సినిమాను నిర్మించనున్నట్లు ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది. సుమారు రూ.1300 కోట్లకు పైగా బడ్జెట్‌తో 'వారణాసి'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇది భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్ట్ లలో ఒకటిగా నిలవనుంది. ఈ సినిమాను పూర్తిగా ఫార్మాట్లో చిత్రీకరి స్తుండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని, ఈ చిత్రాన్ని అనేక భాషల్లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా నటిస్తున్న విషయం తెలిసిందే హాలీవుడ్ అనుభవం ఉన్న ప్రియాంక పాత్ర సినిమాకు అంతర్జాతీయ ఆకర్షణను తీసుకురానుంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకు వచ్చింది. మహేష్ బాబు పాత్రతో పాటు సినిమాలో ఒక స్పెషల్ నెగటివ్ క్యారెక్టర్ కూడా ఉండబోతుందని, ఆ పాత్రకు ఓ ప్రముఖ బాలీవుడ్ నటుడు ఎంపికైనట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని సమాచారం. 'వారణాసి'కి రాజమౌళి రెగ్యులర్ టీమ్ పని చేస్తుండటం సినిమాపై నమ్మకాన్ని మరింత పెంచుతోంది. మూవీకి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తుండగా, కథ విజయేంద్ర ప్రసాద్ అందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ దేశవ్యాప్తంగా విశేష స్పందనను తెచ్చుకుంది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మహేష్ బాబు లుక్ అన్నీ కలిపి సినిమా స్థాయిని పెంచాయి. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'తో భారతీయ సినిమాను ప్రపంచ పటంలో నిలిపిన రాజమౌళి, ఇప్పుడు 'వారణాసి'తో ఆ స్థాయిని మరింత పెంచాలని చూస్తున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ, డిఫరెంట్ ప్రాజెక్ట్‌గా మారనుంది. ఇంకా పూర్తి వివరాలు బయటకు రావాల్సి ఉన్నా, ఇప్పటివరకు వచ్చిన అప్డేట్స్ చూస్తే 'వారణాసి' కేవలం సినిమా కాదు.. ఒక గ్లోబల్ ఈవెంట్ అవుతుందని చెప్పడంలో సందేహం లేదు.

## క్రేజీ సీక్వెల్ 'ఆవేశం 2' వచ్చేస్తుంది..

# పుష్ప యాక్టర్ ఫహద్ ఫాసిల్ ఏం చెప్పాడంటే..?



తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్. ఈ క్రేజీ యాక్టర్ నటించిన మాలీవుడ్ యాక్షన్ కామెడీ డ్రామా ఆవేశం.రోమాంచం ఫేం జీతూ మాధవన్ డైరెక్ట్ చేశాడు. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్ పోషించిన రంగ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.కాగా ఈ క్రేజీ చిత్రానికి సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. తాజాగా ఓ ఈవెంట్‌లో సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చాడు ఫహద్ ఫాసిల్. ఆవేశం 2 ఉంటుందని అధికారికంగా ప్రకటించాడు. సీక్వెల్ 2027 లేదా 2028లో మొదలు కానుందని కూడా క్లారిటీ ఇచ్చాడు. డైరెక్టర్ జీతూ మాధవన్ సూర్యతో చేస్తున్న తన తొలి తమిళ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీతోపాటు ఫహద్ ఫాసిల్ కమిట్ మెంట్స్ పూర్తయిన తర్వాత ఆవేశం 2 సెట్స్‌పైకి వెళ్లనుందట. మొత్తానికి పుష్ప యాక్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌కు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి.ఓ వైపు ఫహద్ ఫాసిల్ అండ్ టీం కామిక్ టైమింగ్.. మరో యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే ఆవేశం చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న ఆవేశం 2 అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఆవేశం చిత్రాన్ని ఫహద్ ఫాసిల్-నజ్రియా నజీమ్, అన్వర్ రషీద్ సంయుక్తంగా నిర్మించారు.

# సిద్ధూ జొన్నలగడ్డ కొత్త చిత్రం

## డైరెక్టర్ ఆర్ఎస్‌జెతో మూవీ

టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కొత్త సినిమాను ప్రారంభించాడు. శనివారం ఫిబ్రవరి7 ఆయన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ప్రస్తుతం సరైన హిట్లు లేక సతమవుతున్న సిద్ధు తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జే (ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ ఫేమ్) తో చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం 'ప్రొడక్షన్ నెం. 40'గా పిలుస్తున్న ఈ సినిమాకు సంబంధించి త్వరలోనే మరిన్ని వివరాలను చిత్రబృందం వెల్లడించనుంది. సిద్ధు తనదైన శైలిలో మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారని ఈసారి బాక్సాఫీస్ వద్ద బ్లాస్ట్ ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తూ సిద్ధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది.




Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343